

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

జనంసాక్షి

www.janamsakshi.org

హైదరాబాద్ - రంగారెడ్డి
మేడ్చల్ మల్కాజిగిరి వికారాబాద్

గురువారం
5 నవంబర్ 2026

పేజీలు : 08



దగ్గు, సర్ది అని ఆసుపత్రి వెళ్తే...

విద్యార్థిని ప్రాణం తీసిన నిర్లక్ష్యం



- వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో పాటు పోలీసులకు ప్రతిమ ఆసుపత్రి వైద్యులపై ఫిర్యాదు
- సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్
- ప్రాణం పోయినా మాదే బాధ్యతంటూ యాజమాన్యం ఒప్పంద పత్రం



13 ఏళ్ల బాలిక అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటనపై తండ్రి తీవ్ర అనుమానాలు వ్యక్తం చేశారు. వైద్యుల నిర్లక్ష్యం లేదా చికిత్సలో జరిగిన లోపాలే తన కుమార్తె మరణానికి కారణమై ఉండవచ్చని ఆరోపిస్తూ, బాధ్యులైన వైద్యులు, ఆసుపత్రి యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ వైద్య ఆరోగ్య శాఖతో పాటు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రంగారెడ్డి జిల్లా ప్రతినిధి (జనంసాక్షి)

వివరాల్లోకి వెళితే.. రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండలం చిన్న ఉమ్మెంత్యాల గ్రామానికి చెందిన ఎన్నేపల్లి రాఘవేందర్ రెడ్డి (39) కుమార్తె ఎన్నేపల్లి సహస్ర రెడ్డి (13) ఎల్‌బీనగర్‌లోని నారాయణ పాఠశాల హాస్టల్‌లో ఉంటూ 8వ తరగతి చదువుతోంది. దసరా సెలవులకు స్వగ్రామానికి వచ్చిన సమయంలో అనారోగ్యానికి గురి కావడంతో వైద్యం కోసం అక్టోబర్ 24న కేపీహెచ్‌బీ కాలనీ అడ్డగుట్టలోని ప్రతిమ ఆసుపత్రిలో చేర్పించారు.

ఆపరేషన్ విజయవంతమైందని చెప్పి..

అక్టోబర్ 26న రాత్రి సుమారు 7.30 గంటలకు సహస్రను ఆపరేషన్ థియేటర్‌లోకి తీసుకెళ్లారు. సుమారు గంట తర్వాత డాక్టర్ ఎర్రబెల్లి హర్షిణి బయటకు వచ్చి శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తయిందని, ఎలాంటి ఇబ్బందులు లేవని తెలిపినట్లు తండ్రి పేర్కొన్నారు. మరో అరగంటలో బాలిక కోలుకుని గదికి వస్తుందని చెప్పినప్పటికీ, కొద్దిసేపటికే పల్స్ తగ్గిందని చెబుతూ ఐసీయూకు తరలించారని తెలిపారు. అనంతరం అదే రోజు రాత్రి సుమారు 8.30 గంటల సమయంలో తమ కుమార్తె మరణించినట్లు వైద్యులు సమాచారం ఇచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. తన కుమార్తె మరణానికి కారణమేంటని డాక్టర్ ఎర్రబెల్లి హర్షిణి, డాక్టర్ బోయినపల్లి ప్రతీక్‌లను ప్రశ్నించగా, బాలికకు రక్తం గడ్డకట్టే సమస్య ఉండటంతో పాటు ఊపిరితిత్తుల సమస్య కూడా ఉందని తెలిపినట్లు తండ్రి ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే ఆసుపత్రిలో చేర్పించినప్పటి నుంచి నిర్వహించిన పరీక్షల్లో కానీ, స్కానింగ్, ఇతర వైద్య పరీక్షల సమయంలో కానీ రక్తం గడ్డకట్టే సమస్య ఉన్నట్లు తమకు ముందుగా తెలియజేయలేదని ఆరోపించారు. చికిత్సలో ఎదురయ్యే ప్రమాదాలు, సంభవించే సమస్యల గురించి కూడా స్పష్టంగా వివరించలేదని పేర్కొన్నారు.

సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి


శస్త్రచికిత్స విజయవంతమైందని చెప్పిన కొద్దిసేపటికే కుమార్తె మరణించడంతో తమకు అనేక అనుమానాలు కలుగుతున్నాయని సహస్ర తండ్రి రాఘవేందర్ రెడ్డి తెలిపారు. వైద్యుల నిర్లక్ష్యం జరిగిందా? చికిత్సలో ఏమైనా లోపాలు ఉన్నాయా? లేక ఇతర వైద్యపరమైన కారణాలతో మరణం సంభవించిందా? అనే అంశాలపై నిపుణుల వైద్య బృందంతో సమగ్ర విచారణ జరిపించాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో పాటు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన కుమార్తె మరణానికి గల వాస్తవ కారణాలను వెలుగులోకి తీసుకువచ్చి, విచారణలో నిర్లక్ష్యం నిర్ధారణ అయితే బాధ్యులైన వైద్యులు, ప్రతిమ ఆసుపత్రి యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఊపిరితిత్తుల్లో ద్రవం గుర్తింపు.. తొలగింపు ప్రక్రియ

ప్రతిమ ఆసుపత్రిలో వైద్యులు నిర్వహించిన స్కానింగ్, అల్ట్రాసౌండ్ పరీక్షల్లో కుడివైపు ఊపిరితిత్తుల వద్ద ద్రవం పేరుకుపోయినట్లు గుర్తించారు. దీంతో సిరంజి ద్వారా సుమారు అర లీటరు ద్రవాన్ని తొలగించారు. అయితే అక్టోబర్ 26న మళ్లీ నిర్వహించిన ఛాతీ ఎక్స్‌రే, అల్ట్రాసౌండ్ పరీక్షల్లోనూ ద్రవం పూర్తిగా తొలగిపోలేదని వైద్యులు తెలిపినట్లు తండ్రి తన ఫిర్యాదులో పేర్కొన్నారు. పైపు ద్వారా ద్రవాన్ని తొలగించాల్సి ఉంటుందని, ఈ ప్రక్రియకు 10 నుంచి 15 నిమిషాలు మాత్రమే పడుతుందని, ఎలాంటి ఇబ్బందులు ఉండవని వైద్యులు భరోసా ఇవ్వడంతో తాము అంగీకరించినట్లు తెలిపారు.

ఒప్పంద పత్రం రాసిచ్చిన ఆసుపత్రి యాజమాన్యం

చికిత్స పొందుతూ బాలిక మృతిచెందిన ఘటనపై బాధితులు ఆసుపత్రి ముందు పెద్దఎత్తున ఆందోళన చేశారు. ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యంతోనే తమ పాప మృతి చెందిందని ఆందోళన చేయడంతో దిగివచ్చిన ప్రతిమ ఆసుపత్రి యాజమాన్యం.. బాలిక మృతిచెందిన ఘటనకు ఆసుపత్రి యాజమాన్యమే బాధ్యత వహిస్తుందని ఒప్పంద పత్రం రాసిచ్చింది. దానిపై ఆసుపత్రి ముద్ర వేసి సంతకం చేసి బాధితులకు అందజేశారు. అయితే ఇప్పటివరకు బాధితులకు ఎలాంటి స్పందన ఇవ్వడం లేదని ఆరోపించారు. ఈ మేరకు పోలీసులతో పాటు వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఆ పత్రాలను మీడియాకు విడుదల చేశారు.



అధికారి అవినీతికి ఎదురేదీ..!?

- అయ్యప్ప సొసైటీ అక్రమాల వెనుక సర్కిల్ "కీలక" అండ
- ఆజ్ఞ లేనిదే అడుగు వేయొద్దు.. కన్నెత్తి చూడొద్దు
- మాదాపూర్ సర్కిల్ పరిధిలో కనుసైగల్లోనే అక్రమ నిర్మాణాలు

ఉన్నతాధికారులైనా ఆయన పలుకుబడికి హుష్ పటాకే..

శేరిలింగంపల్లి, నవంబర్ 04 (జనంసాక్షి) :

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మాదాపూర్ సర్కిల్ వివాదాలకు కేంద్రంగా మారుతోంది నే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా సర్కిల్‌లోని ఓ కీలక అధికారి వ్యవహారశైలిపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రజాపాలనకు ప్రాధాన్యం ఇవ్వకుండా, అన్ని విభాగాలపై ఆధిపత్యం చెలాయిస్తూ తన కనుసన్నల్లోనే వ్యవహారాలు నడిపిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫలితంగా ప్రజా సమస్యలు పక్కదారి పడటమే కాకుండా, అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట పడటం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

లోపలి పేజీలో



అయ్యప్ప సొసైటీ 100 ఫీట్ల రోడ్డుకు కూతవేటు దూరంలో వెలుస్తున్న అక్రమ నిర్మాణాలు

జనంసాక్షి

అధికారి అవినీతికి ఎదురేదీ..!?

మాదాపూర్ సర్కిల్‌లో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న సదరు అధికారి అనుమతి లేకుండా కార్యాలయంలో ఏ పని ముందుకు సాగని పరిస్థితి ఉందని సిబ్బంది, స్థానికులు చెబుతున్నారు. ఇంజనీరింగ్, టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ విభాగాల వ్యవహారాల్లోనూ ఆయన జోక్యం అధికంగా ఉంటోందని, ఫైళ్ల కదలిక నుంచి క్షేత్రస్థాయి పర్యవేక్షణ వరకు అన్నీ ఆయన ఆదేశాల మేరకే జరుగుతున్నాయనే ఆరోపణలున్నాయి. జోనల్, కార్పొరేషన్ ఉన్నతాధికారుల ఆదేశాలను సైతం పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారాలపై ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.

అయ్యప్ప సొసైటీలో అక్రమ నిర్మాణాల కలకలం

మరోవైపు మాదాపూర్ సర్కిల్ పరిధిలోని అయ్యప్ప సొసైటీలో అక్రమ నిర్మాణాల వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. సుమారు 200 నుంచి 2,500 గజాల విస్తీర్ణం కలిగిన స్థలాల్లో అనుమతులు లేకుండానే దాదాపు 20 నిర్మాణాలు కొనసాగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇంత బహిరంగంగా నిర్మాణాలు జరుగుతున్నా టౌన్‌ప్లానింగ్ అధికారులు ఎందుకు స్పందించడం లేదనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. క్షేత్రస్థాయి సిబ్బంది సైతం ఈ వ్యవహారంపై మాట్లాడేందుకు వెనుకాడుతున్నారనే ప్రచారం సాగుతోంది.



అయ్యప్ప సొసైటీ 100 ఫీట్ల రోడ్డుకు కూతవేటు దూరంలో వెలుస్తున్న అక్రమ నిర్మాణాలు



అక్రమ నిర్మాణాలకు అండగా నిలుస్తూ కొందరు భారీగా లబ్ధి పొందుతున్నారనే ఆరోపణలపైనా విచారణ జరపాలని స్థానికులు కోరుతున్నారు. సదరు అధికారి వ్యవహారశైలి, అయ్యప్ప సొసైటీలో కొనసాగుతున్న నిర్మాణాలపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి వాస్తవాలను వెలికితీస్తారా? అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేస్తారా? అన్నది వేచి చూడాలి.

వ్రజలలో మార్పు రావాలి : బీఆర్ఎస్ మండల నాయకుడు వడ్డే రాజు

మండలంలో జరుగుతున్న నేరాలు, ఘోరాలను ప్రభుత్వం అరికట్టాలి



మొయినాబాద్ నవంబర్04 జనంసాక్షి : ప్రజలలో మార్పు తెచ్చేందుకు ప్రభుత్వం ద్వారా అందరం కృషి చేయాలని అందులో భాగంగా పోలీసులు విద్యార్థులకు అవగాహన కల్పించాలని మొయినా బాద్ మండల బీఆర్ఎస్ బాకారం గ్రామానికి చెందిన వడ్డే రాజు అన్నారు. బుధవారం నాడు ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ మొయినాబాద్లో ఎన్నో విద్యా సంస్థలు ఉన్నప్పటికి విద్యార్థులకు అవగాహన కల్పించడంలో తమవంతు కృషిగా ప్రభుత్వం ద్వారా అవగాహన కల్పించాలన్నారు. చెడు అలవాట్లే విద్యార్థులకు శాపంగా మారుతున్నాయని పేర్కొన్నారు. నేడు సమాజంలో గంజాయి, డ్రగ్స్ ఎంతో విద్యార్థులకు శాపంగా మారుతుందని వారి బావి జీవితాలకు వులిస్టాప్ గా ఉంటుందని అన్నారు. అలాంటి కార్యక్రమాలలో విద్యార్థులుపాల్గొనకుండా ప్రభుత్వం ద్వారా పోలీసు అధికారులు అవగాహన కల్పించి విద్యార్థుల భవిష్యత్తు కోసం కృషి చేయాలని పేర్కొన్నారు. కేజీరెడ్డి విద్యార్థుల మృతి సంఘటన ఎంతో బాధాకరమన్నారు. విద్యార్థులలో చైతన్యం తేవాల్సిన బాధ్యత విద్యా సంస్థలతో పాటు అధికారులు కృషి చేయాలని ఆయన పేర్కొన్నారు.

కవిత జన్మదినం సందర్భంగా రక్త మైసమ్మ ఆలయంలో అన్నదానం

మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తాటికొండ స్వప్న పరిమళ్.



తాండూరు నవంబర్ 4(జనంసాక్షి) : తాటికొండ కవిత (అక్క) 50వ జన్మదినం సందర్భంగా తాండూరు పట్టణంలోని రక్త మైసమ్మ దేవాలయం దగ్గర ఘనంగా అన్నదానం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తాటికొండ స్వప్న పరిమళ్ ఆధ్వర్యం వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాటికొండ కవిత అక్క 50వ జన్మదినం సందర్భంగా అమ్మవారి ఆశీస్సులతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. సేవా కార్యక్రమాలే మాకు స్ఫూర్తిఆని తెలిపారు.అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, వచ్చిన భక్తులకు, పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, మహిళలు, అభిమానులు, నాయకులు పాల్గొన్నారు.

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం

పౌర పనులను వేగవంతం చేయాలని అధికారులకు కమిషనర్ సృజన ఆదేశం

శేరిలింగంపల్లి, నవంబర్ 4(జనంసాక్షి): సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ సీఎంసీ పరిధిలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేయాలని, ప్రజల ఫిర్యాదులకు సకాలంలో స్పందించి శాశ్వత పరిష్కారాలు చూపాలని సీఎంసీ కమిషనర్ సృజన అధికారులను ఆదేశించారు. నగరంలో కొనసాగుతున్న పనుల పురోగతి, పౌర సేవల పంపిణీ తీరుపై ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్, పట్టణ జీవవైవిధ్య యూబీడీ విభాగాల అధికారులతో పాటు జోనల్ కమిషనర్లు, విభాగాధిపతులు మరియు డిప్యూటీ కమిషనర్లతో సైబరాబాద్ కమిషనర్ ఒక సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు. కమిషనర్ సృజన మాట్లాడుతూ

నాణ్యతలో రాజీ లేదు మౌలిక సదుపాయాల కల్పనలో ఎట్టి పరిస్థితుల్లోనూ నాణ్యతా ప్రమాణాలు కోల్పోకూడదని, పనులన్నీ నిబంధనల ప్రకారమే జరగాలని కమిషనర్ స్పష్టం చేశారు. నీటి నిల్వ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని, వర్షాకాలంలో లేదా సాధారణ రోజుల్లో పదేపదే తలెత్తుతున్న నీటి నిల్వ వాటర్ లాగింగ్ సమస్యలను గుర్తించి, వాటికి తక్షణమే శాశ్వత పరిష్కారాలు చూపాలని ఇంజనీరింగ్ శాఖను ఆదేశించారు. పట్టణ సౌందర్యీకరణకు పీపీపీ విధానం/ప్రత్యేక దృష్టి: నగరంలోని రోడ్డు కూడళ్లు, ఫుట్‌పాత్‌లు, మరియు పార్కుల అభివృద్ధి, మెరుగుదల పనులను వేగవంతం చేయాలని యూబీడీ విభాగాన్ని కోరారు. అంతర్‌శాఖ సమన్వయం వివిధ విభాగాల మధ్య పరస్పర సమన్వయాన్ని బలోపేతం చేయడం ద్వారా ప్రాజెక్టుల ఆలస్యాన్ని నివారించవచ్చని తెలిపారు. అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తూ పెండింగ్ పనులకు చెక్ పెట్టాలని, ఎక్కడెక్కడైతే పనులు పెండింగ్‌లో ఉన్నాయో, వాటిని గుర్తించి వెంటనే పూర్తి చేయాలి అని అధికారులకు స్పష్టం చేశారు. నిర్దేశిత కాలపరిమితి ప్రతి ప్రాజెక్టును ముందుగా నిర్ణయించిన గడువులోగా పూర్తి చేసేలా క్షేత్రస్థాయి పరిశీలన ఉండాలని ఆమె కోరారు.

బాధిత కుటుంబానికి అండగా జాతీయ వడ్డెర సంఘం అధ్యక్షుడు పిట్ల శ్రీధర్

మొయినాబాద్ నవంబర్ 04జనం సాక్షి :

కామారెడ్డి జిల్లా బాన్సువాడలోని ఎర్రమ న్ను కుచ్చ ప్రాంతంలో నాటు బాంబుల పేలుడు ఘటనలో తీవ్రంగా గాయపడిన బాధితులను జాతీయ వడ్డెర సంఘం జాతీయ అధ్యక్షుడు పిట్ల శ్రీధర్ పరామర్శించి, వారికి అండగా నిలిచారు. ఈ ప్రమాదంలో ఏడుగురు గాయపడగా, వారిలో వడ్డెర సామాజిక వర్గానికి చెందిన దండుగుల రాజు (32), ఆయన కుమార్తెలు శ్రీదేవి (7), అంజలి (5) తీవ్రంగా గాయపడ్డారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్కు తరలించిన చిన్నారులను నిలోఫర్ ఆసుపత్రిలో, రాజును ఉస్మానియా ఆసుపత్రిలో పిట్ల శ్రీధర్ పరామర్శించారు.వైద్యులను కలిసి బాధితుల ఆరోగ్య పరిస్థితి, అందుతున్న చికిత్స వివరాలు తెలుసుకున్నారు. బాధిత కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ, ఎలాంటి ఇబ్బంది వచ్చినా తనకు ఫోన్ చేయాలని, తాను అందుబాటులో ఉంటానని భరోసా ఇచ్చారు. వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయం అందించారు. ఇప్పటికే ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి బాధితులను పరామర్శించి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించడంతో పాటు ఆర్థిక సహాయం అందించారు. రాత్రి నుంచే వైద్యులతో ఫోన్లో మాట్లాడి చికిత్సను పర్యవేక్షిస్తున్నారు. ఈ పరామర్శలో వడ్డెర సంఘం నాయకులు గుంజ ఆంజనేయులు, కొడగంటి కృష్ణ, గోగుల రమేష్, మాజీ జడ్పీటీసీ గోపాల్ రెడ్డి, తాడ్కోల్ సర్పంచ్ రమేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు



తెలంగాణ చరిత్రలో చెరగని సంతకం

- **ఉద్యమమే ఊపిరిగా సాగిన కేసీఆర్ ప్రస్థానం**
- **చౌడాపూర్ మండలం బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సుధాకర్ రెడ్డి**

చౌడాపూర్ నవంబర్ 04 జనం సాక్షి :



తెలంగాణ అంటే ఒక భౌగోళిక ప్రాంతం మాత్రమే కాదు... అది కోట్లాది ప్రజల ఆత్మగౌరవం, ఎన్నో ఏళ్ల పోరాటం, ఎన్నో త్యాగాల ఫలితం. ఆ ప్రత్యేక తెలంగాణ ఆకాంక్షకు రాజకీయ వేదిక కల్పించి, ప్రజా ఉద్యమాన్ని ముందుకు నడిపించిన నాయకుడు కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు. 2001లో ఉద్యమానికి శ్రీకారం... 2009లో ఆమరణ నిరాహార దీక్ష... ఎన్నో పోరాటాలు, ఎన్నో ఒడిదుడుకుల మధ్య 2014 జూన్ 2న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం.రాష్ట్రం ఏర్పడిన తర్వాత పదేళ్ల పాలనలో సాగునీరు, తాగునీరు, వ్యవసాయం, విద్యుత్, సంక్షేమం, గ్రామీణాభివృద్ధి వంటి రంగాల్లో అనేక పథకాలు అమలు చేశారు.మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, రైతుబంధు, రైతుబీమా, కాళేశ్వరం ప్రాజెక్టు, ఆసరా పెన్షన్లు వంటి కార్యక్రమాలు ఆ పాలనలో ప్రత్యేకంగా నిలిచాయి.తెలంగాణ ఉద్యమ చరిత్రలో ఒక అధ్యాయం... ముఖ్యమంత్రిగా పదేళ్ల పాలనలో మరో అధ్యాయం... కేసీఆర్ ప్రస్థానం తెలంగాణ రాజకీయ చరిత్రలో ఎప్పటికీ చర్చించబడుతుంది.

గ్రామాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని మండల స్థాయి సమీక్షలో అధికారుల దృష్టికి తీసుకెళ్లిన సర్పంచులు

- **ఎల్‌నినో ప్రభావం వల్ల విబిజిరాంజీ పథకం సద్వినియోగం చేసుకోవాలి**
- **సాదాసీదాగా జరిగిన మండల సర్వసభ్య సమావేశం**



బొంరాస్ పేట , నవంబర్ 4 (జనం సాక్షి): మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం మండల ప్రత్యేక అధికారి మాధవరెడ్డి అధ్యక్షతన మండల స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో ఆయా శాఖలకు చెందిన అధికారులు గత 45 రోజుల నుండి జరిగిన అభివృద్ధి ప్రణాళికలకు సంబంధించి ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. గ్రామాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని మండల స్థాయి సమీక్షలో అధికారుల దృష్టికి ఆయా గ్రామాల సర్పంచులు తీసుకెళ్లారు. ఆయా గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులు ప్రజా ప్రతినిధులకు సూచించారు.వివిజిరాంజీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నర్సింలు గౌడ్ మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావం వల్ల వర్షాలు ఇబ్బందులు పడుతున్న ప్రజలు వివిజిరాంజీ పథకంలో భాగంగా ప్రతి ఇంటికి ఇంకుడు గుంతలు,బోర్ వెల్ రీఛార్జ్ గుంత, కమ్యూనిటీ ఇంకుడు గుంత, నీటి కుంటలు,ఊట కుంటలు తదితర పనులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామాలలో ఉపాధి హామీ కూలీలు పెద్ద ఎత్తున పనులకు వెళ్లేలా చొరవ చూపాలని అధికారులు కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేష్ రెడ్డి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి దయానంద్, ఆయా శాఖల అధికారులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

టపాసులు కాల్చేటప్పుడు జాగ్రత్తగా ఉండండి

అజాగ్రత్త వహిస్తే జీవితాంతం చీకటే..

ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల కన్సల్టెంట్ ఆప్తాల్మాలజిస్ట్ డాక్టర్ నవ్య చెరుకూరి

హైదరాబాద్, నవంబర్ 4 (జనంసాక్షి) : టపాసులు కాల్చేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల, కల్లం అంజిరెడ్డి క్యాంపస్ (హైదరాబాద్) కన్సల్టెంట్ ఆప్తాల్మాలజిస్ట్ డాక్టర్ నవ్య చెరుకూరి తెలిపారు. అజాగ్రత్త వహిస్తే జీవితాంతం చీకటేనన్నారు. వెలుగుల పండుగ దీపావళి సంతోషం, ఆనందోత్సాహాలు, ఆత్మీయ కలయికల కలబోత అన్నారు. ప్రతి ఒక్కరికీ ఆనందం, శ్రేయస్సు ముఖ్యంగా సురక్షితమైన దీపావళే మా లక్ష్యమన్నారు. ఈ పండుగ వెలుగులు, చిరునవ్వులు, టపాసుల మిరుమిట్లు తెచ్చినప్పటికీ, బాధ్యతాయుతంగా వేడుకలు జరుపుకోవడం, మన, మన ఆత్మీయుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వడం అత్యంత ముఖ్యమన్నారు. దీపావళి అంటే మన ఆరోగ్యం, సంక్షేమం, కంటి చూపును కాపాడుకోవడమేనన్నారు. 'బాధ్యతాయుతంగా పండుగను జరుపుకుందాం, సురక్షితంగా ఉందాం. చూపు అనే అమూల్యమైన కానుకకు ఎలాంటి భంగం కలగకుండా ఈ వెలుగుల పండుగ అందరి జీవితాల్లో కాంతులు నింపాలని ఆశిద్దాం' అని పేర్కొన్నారు. టపాసుల వల్ల కలిగే కంటి గాయాలు స్వల్ప చికాకు, పైపై గీతలు మొదలుకొని తీవ్రమైన ప్రమాదాలకు దారి తీయవచ్చన్నారు. వీటిలో కార్నియా దెబ్బతినడం, కంటి లోపల రక్తస్రావం, ట్రూమాటిక్ క్యాటరాక్ట్ (గాయం వల్ల వచ్చే శుక్లాలు), రెటీనా దెబ్బతినడం, చివరకు శాశ్వతంగా కంటి చూపు కోల్పోయే ప్రమాదం కూడా ఉందన్నారు. టపాసులపై ఆసక్తి, ప్రమాదాలపై సరైన అవగాహన లేకపోవడం వల్ల ముఖ్యంగా పిల్లలు ఈ ముప్పునకు గురయ్యే అవకాశం ఎక్కువన్నారు. టపాసులు కాల్చకుండా కేవలం చూస్తున్న వారికి కూడా తీవ్ర గాయాలు అయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. ప్రజలు తమను, తమ కుటుంబ సభ్యులను, తమ చుట్టూ ఉన్న వారిని కాపాడుకోవడానికి సరళమైన, కీలకమైన కంటి జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉందన్నారు. దీపావళి వేడుకలకు సిద్ధమవుతున్న ఈ సమయంలో చిన్నపాటి జాగ్రత్తలు వేడుకలు అందరికీ సురక్షితంగా, ఆనందంగా సాగేలా చేయడంలో ఎంతో దోహదపడతాయన్నారు. బాధ్యతాయుతంగా పండుగను జరుపుకోవడం వల్ల మనకు అత్యంత విలువైన మన ప్రియతముల ఆరోగ్యం, శ్రేయస్సు, కంటి చూపును కాపాడుకోవచ్చన్నారు.



కంటికి గాయమైనప్పుడు మెల్లగా కడగాలన్నారు. కంటిలో ఏదైనా నలుసు, చెత్త పడితే శుభ్రమైన నీటితో లేదా సెలైన్ ద్రావణంతో సున్నితంగా కడగాలన్నారు. ఇంట్లోనే ఆ నలుసును తీయడానికి ప్రయత్నించడం, తొలగించడానికి ఇతర పదార్థాలు ఉపయోగించడం చేయకూడదన్నారు. కంటి కదలికలను నివారించడానికి, మరింత గాయం కాకుండా చూసేందుకు వీలైతే కంటిపై శుభ్రమైన పొడి గుడ్డను లేదా 'ఐ షీల్డ్'ను ఉంచాలన్నారు. గాయం తీవ్రం కాకుండా ఉండటానికి గాయపడిన కంటిని మూసి ఉంచాలని పేర్కొన్నారు. గాయపడిన వ్యక్తిని వీలైనంత త్వరగా కంటి వైద్య నిపుణుడి వద్దకు లేదా ఎమర్జెన్సీ వార్డుకు తీసుకెళ్లాలన్నారు. వైద్యులు ఇచ్చే సూచనలను కచ్చితంగా పాటించాలన్నారు. గాయపడిన కంటిపై ఎలాంటి ఒత్తిడి పెట్టకూడదన్నారు. ఇది గాయాన్ని మరింత తీవ్రతరం చేస్తోందన్నారు. గాయపడిన కంటిని ముట్టుకోవడం, రుద్దడం వంటివి చేయకూడదన్నారు. దీనివల్ల పరిస్థితి మరింత దిగజారవచ్చన్నారు. వైద్యుల సలహా లేకుండా కంటిపై ఎలాంటి ఆయింట్‌మెంట్లు, క్రీములు, ఇంటి చిట్కాలు ప్రయోగించవద్దన్నారు. కంటిలో ఏదైనా వస్తువు, చెత్త గుచ్చుకుని ఉంటే దానిని స్వయంగా బయటకు తీయడానికి ప్రయత్నించవద్దన్నారు. గాయం చిన్నదిగా అనిపించినా వైద్య సహాయం పొందడంలో ఆలస్యం చేయవద్దన్నారు. సకాలంలో చికిత్స అందడం చాలా ముఖ్యమన్నారు. కంటికి గాయమైన వ్యక్తిని స్వయంగా డ్రైవింగ్ చేయనివ్వవద్దన్నారు. మరొకరి సహాయం తప్పనిసరి అన్నారు. తీవ్రమైన నొప్పి, చూపులో మార్పులు, అధిక రక్తస్రావం వంటి లక్షణాలు కనిపిస్తున్నాయా? అని గమనిస్తూ ఉండాలన్నారు. అలాంటివి ఏవైనా ఉంటే వెంటనే అత్యవసర సహాయం పొందాలన్నారు.

ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల సూచనలు..

టపాసులకు బదులు సంప్రదాయ ప్రమిదలు, ఎల్ఈడీ దీపాలు, రంగోలి, కుటుంబ కలయికలతో పండుగను జరుపుకోవడానికి ప్రాధాన్యత ఇవ్వండి. గుర్తింపు పొందిన తయారీదారుల నుంచే టపాసులను కొనుగోలు చేయండి. వాటిని రెండు రోజుల పాటు ఎండలో బాగా ఆరబెట్టేలా చూసుకోండి. టపాసులను పిల్లలకు అందకుండా, గ్యాస్ సిలిండర్లు, నూనె డబ్బాలు వంటి మండే స్వభావం గల వస్తువులకు దూరంగా, కార్డ్‌బోర్డ్ పెట్టెలలో భద్రపరచండి. పిల్లలు టపాసులు కాల్చేటప్పుడు పెద్దలు ఎల్లప్పుడూ వారిని దగ్గరుండి పర్యవేక్షించాలి. ఒకేసారి అందరూ కాకుండా ఒక్కొక్కరు మాత్రమే టపాసును వెలిగించేలా చూడండి. మిగిలిన వారు దూరం నుంచి గమనించాలి. టపాసులు కాల్చడానికి విశాలమైన, బహిరంగ ప్రదేశాలను ఎంచుకోండి. టపాసులను వెలిగించడానికి పొడవాటి అగర్‌బత్తీలు, కాకరపువ్వొత్తులను ఉపయోగించండి. కాలిన గాయాలను తక్షణమే చల్లార్చడానికి సమీపంలో రెండు బకెట్ల నీటిని సిద్ధంగా ఉంచుకోండి. తీవ్రమైన గాయాలైతే బాధితుడిని శుభ్రమైన దుప్పటిలో చుట్టి వెంటనే ఆసుపత్రికి తరలించండి. టపాసులు కాల్చేటప్పుడు తప్పనిసరిగా నాణ్యమైన కళ్లద్దాలు ధరించండి.

టపాసులను చేతిలో పెట్టుకుని ఎట్టి పరిస్థితుల్లోనూ వెలిగించవద్దు. టపాసులు వెలిగించేటప్పుడు వాటి పైకి వంగవద్దు.సీసాలు, టిన్ డబ్బాలు, బోర్లించిన కుండలు వంటి పాత్రల లోపల టపాసులు ఉంచి వెలిగించకండి. ఇది తీవ్రమైన ప్రమాదాలకు దారి తీస్తుంది. ఈదురు గాలులు బలంగా వీస్తున్నప్పుడు గాల్లోకి ఎగిరే బాణా సంచాను (రాకెట్లు మొదలైనవి) వెలిగించవద్దు. టపాసుల వల్ల కంటికి గాయమైనప్పుడు మొదట అది స్వల్పంగా అనిపించినా తీవ్రమైన విషయంగానే పరిగణించాలి. సకాలంలో అందించే సరైన ప్రథమ చికిత్స అధిక నష్టం జరగకుండా నిరోధించడంతో పాటు కంటి చూపును కాపాడుతుంది. గాయపడిన కంటిని నలపడం, ఒత్తడం, మర్దన చేయడం వంటివి చేయవద్దు.

పల్లా జాన్ రాములు జయంతి వేళ ఘనంగా ఉచిత వైద్య శిబిరం

- **వర్షాన్ని సైతం లెక్కచేయక తరలివచ్చిన వెయ్యి మంది పేదలు**
- **డోర్నకల్ బిషప్ డాక్టర్ కె. సేనం రాజు చేతుల మీదుగా ప్రారంభం**
- **300 మందికి పైగా ఉచితంగా కళ్లజోళ్ల పంపిణీ**

ఖమ్మం, నవంబరు 4 (జనంసాక్షి): పేదల పక్షపాతి, పీడిత ప్రజల హక్కుల పోరాట యోధుడు స్వర్గీయ పల్లా జాన్ రాములు 88వ జయంతి సందర్భంగా ఖమ్మం మిషన్ ఆసుపత్రి ప్రాంగణంలో నిర్వహించిన ఉచిత జనరల్ మరియు కంటి వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఆయన కుమారుడు, ప్రముఖ సమాజ సేవకుడు పల్లా కిరణ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ మహా శిబిరాన్ని డోర్నకల్ డయోసిస్ బిషప్ రైట్ రెవరెండ్ డాక్టర్ కె. సేనం రాజు ముఖ్య అతిథిగా విచ్చేసి ఘనంగా ప్రారంభించారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాన్ని సైతం లెక్కచేయకుండా సుమారు 1,000 మందికి పైగా నిరుపేదలు శిబిరానికి తరలివచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. రోగులకు ఉచితంగా మందులు అందజేయడంతో పాటు, కంటి సమస్యలతో బాధపడుతున్న 300 మందికి పైగా బాధితులకు ఉచితంగా కళ్లద్దాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బిషప్ డాక్టర్ కె. సేనం రాజు మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి జీవితాంతం అంకితమైన పల్లా జాన్ రాములు ఆశయాలను ఆయన తనయుడు పల్లా కిరణ్ సేవా కార్యక్రమాల ద్వారా సజీవంగా నిలబెడుతున్నారని కొనియాడారు. పేదలకు ఆరోగ్యాన్ని, చూపును ప్రసాదించే ఇలాంటి వైద్య శిబిరాలు నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు.



20 ఏళ్లుగా నిరంతర ప్రజాసేవ : పల్లా కిరణ్

నిర్వాహకుడు పల్లా కిరణ్ మాట్లాడుతూ.. తన తండ్రి చూపిన బాటలోనే గత రెండు దశాబ్దాలుగా ప్రజలకు సేవలందిస్తున్నట్లు తెలిపారు. ఏడాదికి రెండుసార్లు మెగా వైద్య శిబిరాల నిర్వహణ, కరోనా విపత్కర కాలంలో మూడు వేల కుటుంబాలకు నిత్యావసరాలు, పచ్చళ్ల పంపిణీ, ఉపాధి కోల్పోయిన ప్రైవేటు ఉపాధ్యాయులకు బియ్యం పంపిణీ వంటి ఎన్నో కార్యక్రమాలు చేపట్టినట్లు గుర్తుచేశారు. వరదల సమయంలో బాధితులకు అండగా నిలవడం, తాగునీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో సొంత ఖర్చుతో బోర్లు వేయించి ట్యాంకర్లతో నీటి సరఫరా చేయడం, నిరుపేద విద్యార్థుల ఉన్నత చదువులకు ఆర్థిక సాయం అందించడం ద్వారా సమాజానికి ఎల్లవేళలా అండగా ఉంటున్నామని పేర్కొన్నారు. వృద్ధులు, వికలాంగులు, అనాథ పిల్లల సంక్షేమానికి తమ వంతు సహాయం నిరంతరం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రెవ. డాక్టర్ విశ్వం, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ ఎల్లయ్య, జి. ప్రభాకరరావు, రెవ. బి. శ్రీనివాస్ పాల్, రెవ. ఇశ్రాల్ రెడ్డి, చిలకబత్తిని కనకయ్య పాల్గొని పల్లా కిరణ్‌ను ఆశీర్వదించారు. వైద్యులు డా. రఘు, డా. సృజన్, డా. రాజు కుమార్, డా. హరికృష్ణ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించగా, గంట కిరణ్ మరియు పల్లా కిరణ్ యూత్ సభ్యులు సేవలందించి శిబిరాన్ని విజయవంతం చేశారు.





నిరుపేదలపైనే టౌన్ ప్లానింగ్ అధికారుల ప్రతాపం

అక్రమ బహుళ అంతస్తుల నిర్మాణాలపై మౌనం.. చిరువ్యాపారులపై మాత్రం కొరడా

నాచారం, నవంబర్ 4 (జనంసాక్షి) : కాప్రా సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారుల చర్యలు వివాదాస్పదంగా మారాయి. నిబంధనల పేరుతో రోడ్డుపై జీవనోపాధి సాగించే చిరువ్యాపారులు, నిరుపేదలపై కఠినంగా వ్యవహరిస్తున్న అధికారులు.. అనుమతులు లేని బహుళ అంతస్తుల నిర్మాణాల విషయంలో మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఒకే ప్రాంతంలో రెండు రకాల న్యాయాలు అమలవుతున్నాయంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం మల్లాపూర్ డివిజన్‌లోని ఎలిఫెంట్ సర్కిల్ నుంచి జనప్రియ వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న చిరువ్యాపారుల ఆక్రమణలను టౌన్ ప్లానింగ్ అధికారులు తొలగించారు. ఫుట్‌పాత్‌ల ఆక్రమణల తొలగింపు, రహదారులపై ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవడం సమర్థనీయమే అయినప్పటికీ, ముందస్తు సమాచారం లేకుండా ఒక్కసారిగా చేపట్టిన తొలగింపులతో చిరువ్యాపారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని స్థానికులు పేర్కొంటున్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలేవీ?

మరోవైపు నాచారం, హెచ్ఎంటీ, మల్లాపూర్ డివిజన్ల పరిధిలో గత కొన్ని నెలలుగా అనుమతులకు విరుద్ధంగా బహుళ అంతస్తుల నిర్మాణాలు కొనసాగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. స్థానికుల కథనం ప్రకారం, ఈ నిర్మాణాలపై పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ సంబంధిత అధికారులు స్పందించడం లేదని విమర్శిస్తున్నారు. కొన్నిచోట్ల రాజకీయ పలుకుబడి ఉన్నవారి అండదండలతోనే నిర్మాణాలు కొనసాగుతున్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రోడ్డుపై చిన్నపాటి వ్యాపారం చేసుకునే పేదలపై తక్షణమే చర్యలు తీసుకునే అధికారులు, భారీ నిర్మాణాల విషయంలో ఎందుకు మౌనం పాటిస్తున్నారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. నిబంధనలు అందరికీ సమానంగా వర్తించాలే తప్ప, ఆర్థిక స్థోమతను బట్టి చర్యలు మారకూడదని అభిప్రాయపడుతున్నారు.


మల్లాపూర్‌లో ఫుట్‌పాత్‌లపై ఆక్రమణల తొలగింపు

అవినీతి ఆరోపణలపై విచారణ ఏదీ?

టౌన్ ప్లానింగ్ విభాగంలోని కొందరు అధికారులు, సిబ్బంది అక్రమ నిర్మాణాలకు సహకరిస్తున్నారనే తీవ్ర ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. నిర్మాణాల వారీగా ముడుపులు తీసుకుంటూ నిబంధనలకు విరుద్ధమైన కట్టడాలను ప్రోత్సహిస్తున్నారంటూ స్థానికులు, సామాజిక కార్యకర్తలు ఆరోపిస్తున్నారు. అయితే ఈ ఆరోపణలపై అధికారిక విచారణ జరిగి వాస్తవాలు వెలుగులోకి రావాల్సి ఉంది. నిరుపేదల జీవనోపాధిని దెబ్బతీసే చర్యలతో పాటు, అక్రమ నిర్మాణాలపై కూడా సమాన స్థాయిలో చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. కాప్రా సర్కిల్ టౌన్ ప్లానింగ్ ఏసీపీ నుంచి టీపీఎస్, టైన్‌మెన్ వరకు సంబంధిత అధికారుల పనితీరుపై ఉన్న ఆరోపణలపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. పేదలపై ప్రతాపం చూపడమేనా నిబంధనల అమలు? భారీ నిర్మాణాలపై కూడా అదే కఠినత్వం చూపుతారా? అన్నది ఇప్పుడు స్థానికుల్లో చర్చనీయాంశంగా మారింది.


నాచారం, మల్లాపూర్ పరిధిలో కొనసాగుతున్న బహుళ అంతస్తుల నిర్మాణాలు

మంజూరైన నిధులున్నా.. మూడేళ్లుగా పూర్తికాని డ్రైనేజీ పనులు

అధికారుల నిర్లక్ష్యంపై మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి ఆగ్రహం

హయత్‌నగర్, నవంబర్ 4 (జనం సాక్షి) : ప్రభుత్వం నిధులు మంజూరు చేసి దాదాపు మూడేళ్లు గడుస్తున్నా డ్రైనేజీ ట్రంక్‌లైన్ పనులు పూర్తికాకపోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని హయత్‌నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని ముదిరాజ్ కాలనీ నుంచి మునుగనూర్ కల్వర్టు వరకు చేపట్టాల్సిన డ్రైనేజీ ట్రంక్‌లైన్ పనులు మూడు విడతలుగా పూర్తి చేయాల్సి ఉండగా, మధ్యలోనే పనులు నిలిచిపోవడంతో లక్ష్మీప్రియ కాలనీ, దుర్గా నగర్, శివాజీ నగర్ ప్రాంతాల ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో ఆయా కాలనీలలో పర్యటించిన కళ్లెం నవజీవన్ రెడ్డి స్థానిక ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అసంపూర్తిగా నిలిచిపోయిన డ్రైనేజీ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం సంబంధిత అధికారులతో మాట్లాడి పనులు నిలిచిపోవడానికి గల కారణాలను



తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిధులు మంజూరు చేసినప్పటికీ పనులు పూర్తికాకపోవడం అధికారుల పర్యవేక్షణ లోపానికి, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్నా సంబంధిత అధికారులు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ప్రజాధనంతో చేపట్టే అభివృద్ధి పనులను నిర్దేశిత సమయంలో పూర్తి చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందని, పనుల జాప్యంతో ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం సరికాదని అన్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని నిలిచిపోయిన డ్రైనేజీ ట్రంక్‌లైన్ పనులను తక్షణమే పునఃప్రారంభించి, త్వరితగతిన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా, అధికారంలో ఉన్నా లేకున్నా ప్రజల పక్షాన నిలబడి నిరంతరం పోరాటం చేస్తానని కళ్లెం నవజీవన్ రెడ్డి స్పష్టం చేశారు.

ఓటరు నమోదుపై సమీక్షా సమావేశం



కేశంపేట, నవంబర్ 4 (జనంసాక్షి) : మండల పరిధిలోని కొండారెడ్డిపల్లి గ్రామంలో పట్టపద్రుల ఓటరు నమోదుపై బిఆర్ఎస్ మండల అధ్యక్షులు ఎన్. మురళీధర్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మురళీధర్ రెడ్డి మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు మండలంలోని ప్రతి గ్రామంలో పట్టభద్రులను గుర్తించి ఓటరు నమోదు ప్రక్రియ పై అవగాహన కల్పించడంతోపాటు ఓటర్ గా నమోదు చేయించాలని దిశా నిర్దేశం చేశారు, ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ వర్ధాల లక్ష్మీనారాయణ గౌడ్, బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షులు కానం ప్రేమ్ కుమార్ గౌడ్, గ్రామ ఉపసర్పంచ్ నరేష్, మండల మాజీ కోఆప్షన్ సభ్యులు జమాల్ ఖాన్, , సింగిల్ విండో మాజీ వైస్ చైర్మన్ అంజిరెడ్డి, మాజీ సర్పంచ్ నవీన్ కుమార్, బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి, గ్రామ యువత అధ్యక్షులు దశరథ్, వార్డు సభ్యులు మాదవ్, అరవింద్, నాయకులు వెంకటయ్య, రామకృష్ణ, రవీందర్ గౌడ్, రామకృష్ణారెడ్డి, మహమ్మద్, తకృబ్, మాదవులు ,శ్రీశైలం పాల్గొన్నారు.

దివ్యాంగులు గెలిచారు ఆటల్లో.. పొందారు బహుమతులు

ఆటలతో పిల్లలకు మానసిక ఉల్లాసం

మండల విద్యాధికారి టి.మనోహర్

రంగారెడ్డి జిల్లా ప్రతినిధి (జనంసాక్షి) : వారంతా దివ్యాంగులు అంగవైకల్యం చెవిటి,మూగ,మానసిక స్థితి బాగాలేని విద్యార్థులు, సుమారు 30 మంది విద్యార్థులు భవిత సెంటర్ (చిల్డ్రన్స్ విత్ స్పెషల్ నీడ్స్)ద్వారా వారికి విద్యను అందిస్తున్నారు. ఇదే క్రమంలో ఫరూక్ నగర్ మండల వనరుల కేంద్రం ఆవరణలో దివ్యాంగ విద్యార్థుల ఆటల పోటీలను ఫరూక్‌నగర్ మండల విద్యాధికారి టి.మనోహర్ మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థులకు ఆటల పోటీలు శారీరక దృఢత్వాన్ని మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని పేర్కొన్నారు. అనంతరం పిల్లలకు పరుగు పందెం, కుర్చీలాట, రకరకాల ఆటల పోటీలు ముగిసిన అనంతరం బహుమతులు అందజేశారు. కార్య క్రమంలో స్థానిక ప్రాథమిక పాఠశాల హెచ్ఎం శశికళ, భవిత పాఠశాల ఉపాధ్యాయురాలు ప్రవంతి, ప్రత్యేక ఉపాధ్యాయులు రమాదేవి, ఈశ్వర్, వెంకటేశ్, సరిత ఎంఆర్సి సిబ్బంది రాధాకృష్ణ, రవి, పాండు, ఉష, భాగ్యలక్ష్మి, నాగమణి విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.





బిజెపితోనే అభివృద్ధి సాధ్యం..

వచ్చే ఎన్నికల్లో గెలుపు తథ్యం

రాష్ట్ర అధికార ప్రతినిధి డా. సమత



హైదరాబాద్ (జనంసాక్షి) : వచ్చే అసెంబ్లీ ఎన్నికలలో తెలంగాణ రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి డా. సమత పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రజలు బిజెపి ప్రభుత్వం ఏర్పాటుకావాలని కోరుకుంటున్నారని ఆమె వివరించారు. నరేంద్రమోదీ నాయకత్వంలో భారతదేశం ప్రపంచంలోనే శక్తివంతమైన దేశంగా అవతరించిందని డా. సమత వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని ఆమె ఆరోపించారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం వైఫల్యం చెందిందని డా. సమత విమర్శించారు. సోమవారం హైదరాబాద్ లో జరిగిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా పాదయాత్రతో రాష్ట్ర రాజకీయాలలో పేను మార్పులు సంభవించాయని ఆమె అన్నారు. బిజెపితోనే అభివృద్ధి సాధ్యమనే వాస్తవాన్ని ప్రజలు గ్రహించారని, ప్రజల మద్దతుతో తెలంగాణలో వచ్చేది బిజెపి ప్రభుత్వమేనని డా. సమత స్పష్టం చేశారు.

బియ్యం నిల్వలపై తనిఖీలు చేపట్టండి... ధరలకు కళ్లెం వేయండి

- కృత్రిమ కొరత సృష్టిస్తున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవాలి: బొంగు వెంకటేష్ గౌడ్ డిమాండ్

హయత్ నగర్, నవంబర్ 4 (జనంసాక్షి):



రాష్ట్రంలో బియ్యం ధరలు రోజురోజుకూ పెరుగుతుండటంతో సామాన్య ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని బీసీ పీపుల్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొంగు వెంకటేష్ గౌడ్ అన్నారు. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో ఇబ్బందులు పడుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాలపై బియ్యం ధరల పెరుగుదల అదనపు ఆర్థిక భారాన్ని మోపుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ఆకలి కొందరు వ్యాపారుల లాభాలకు మార్గం కాకూడదని, ప్రభుత్వం వెంటనే స్పందించి ధరల నియంత్రణకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కరువు ప్రభావం స్పష్టంగా కనిపించకముందే బియ్యం ధరలు ఎందుకు పెరుగుతున్నాయని ప్రశ్నించారు. మార్కెట్లో నిజంగానే బియ్యం కొరత ఏర్పడిందా? లేక కొందరు వ్యాపారులు బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేసి కృత్రిమ కొరత సృష్టిస్తున్నారా? అనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. బియ్యం బ్లాక్ మార్కెట్‌కు తరలకుండా అడ్డుకట్ట వేసే బాధ్యత ప్రభుత్వానికి, సంబంధిత అధికారులకు లేదా? అని ప్రశ్నించారు.

రాష్ట్రంలో ధాన్యం ఉత్పత్తి, ప్రభుత్వ కొనుగోళ్లు, గోదాముల్లో నిల్వలు, మిల్లర్ల వద్ద ఉన్న బియ్యం నిల్వలు, మార్కెట్లో సరఫరా పరిస్థితులపై అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు. అక్రమంగా నిల్వలు దాచిపెట్టి అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు తేలితే సంబంధిత వ్యాపారులపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బియ్యం ధరల నియంత్రణ ప్రభుత్వ బాధ్యత అని, మార్కెట్ పర్యవేక్షణ అధికారుల విధి అని స్పష్టం చేశారు. పౌర సరఫరాల శాఖ, తూనికలు-కొలతల శాఖ, సంబంధిత మార్కెట్ నియంత్రణ అధికారులు సమన్వయంతో రాష్ట్రవ్యాప్తంగా తనిఖీలు నిర్వహించాలని సూచించారు. బియ్యం ధరల పెరుగుదలకు గల అసలు కారణాలను ప్రజలకు వెల్లడించి, మార్కెట్లో సరిపడా బియ్యం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజల ఆహార భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకోవాలని, సామాన్యులపై పడుతున్న ధరల భారాన్ని తగ్గించేలా సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని బొంగు వెంకటేష్ గౌడ్ డిమాండ్ చేశారు.

ఆంధ్రప్రదేశ్ గవర్నర్‌ను కలిసిన బంజారా సేవాదళ్ నాయకులు

మహేశ్వరం,నవంబర్4(జనంసాక్షి): ఆంధ్రప్రదేశ్ గవర్నర్ సయిద్ అబ్దుల్ నసీర్ ను మంగళవారం రాత్రి బంజారా సేవాదళ్ వ్యవస్థాపక అధ్యక్షుడు అజయ్ నాయక్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రఘురాం రాథోడ్,గౌరవ అధ్యక్షుడు రామచందర్ నాయక్ మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం హతీరాం బావాజీ మఠాన్ని ప్రక్షాళన చేయాలని వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా బంజారా సేవాదళ్ వ్యవస్థాపక అధ్యక్షుడు అజయ్ నాయక్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రఘురాం రాథోడ్ మాట్లాడుతూ... హతీరామ్ బావాజీ సంబంధించిన భూముల ఆస్తులను పరిరక్షించా లన్నారు. 2007లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జారీ చేసిన మెమో ప్రకారం బంజారా పూజారులు మఠంలో దీప దూప నైవేద్య కార్యక్రమాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

గవర్నర్ ను కలిసిన వారిలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అశోక్ రాథోడ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రతినిధి శివ నాయక్,బంజారా సేవాదళ్ రాష్ట్ర కమిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.





అనుమతులు లేకుండా బోర్లు వేస్తే కఠిన చర్యలు

- డీసీ సుమన్ రావు

శంషాబాద్, నవంబర్ 4 (జనంసాక్షి): నిబంధనలు ఉల్లంఘించి బోర్లు వేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని శంషాబాద్ డీసీ సుమన్ రావు హెచ్చరించారు. ప్రభుత్వ జీఓ 259, వాల్టా చట్టం ప్రకారం బోర్‌వెల్ ఆపరేటర్లతో శంషాబాద్ డీటీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముందస్తు అనుమతులు లేకుండా ఎవరూ బోర్లు వేయకూడదని, తాగునీటి అవసరాల కోసం సైతం ముందుగా అనుమతులు తీసుకోవాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే బోర్‌వెల్ వాహనాలను సీజ్ చేయడంతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఆర్ఐ డీటీ వాణిరెడ్డి పాల్గొన్నారు.

అల్వాల్‌లో ఘనంగా తోట లక్ష్మీకాంతరెడ్డి జన్మదిన వేడుకలు



అల్వాల్, నవంబరు 4 (జనంసాక్షి): మల్కాజిగిరి నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి తోట లక్ష్మీకాంతరెడ్డి జన్మదిన వేడుకలను బుధవారం అల్వాల్ డివిజన్ పరిధిలోని భూదేవి నగర్, సుభాష్‌నగర్, వెంకట్రావుపేట ప్రాంతాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో దిడ్ల స్వామి, ప్రసాద్, సందీప్‌రెడ్డి, శ్రీనివాసరావు, సుధాకర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, సాయికిరణ్, అలోక్, బబ్లూ, రమేష్ తదితరులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రంగారెడ్డి జిల్లాలో ఘనంగా జాతీయ బాలల విజ్ఞాన సదస్సు

- 153 విద్యార్థి బృందాల పోటాపోటీ ప్రదర్శనలు..
- జిల్లాస్థాయిలో 8 బృందాలు ఎంపిక

హయత్‌నగర్, నవంబర్ 4 (జనంసాక్షి):

విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనా దృక్పథం, పరిశోధనా ఆసక్తి, సృజనాత్మకతను పెంపొందించే లక్ష్యంతో నిర్వహించిన రంగారెడ్డి జిల్లా స్థాయి జాతీయ బాలల విజ్ఞాన సదస్సు (చీజూజ 2026-27) పోటీలు బుధవారం హయత్‌నగర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. జిల్లా సైన్స్ అధికారి వై. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి 153 విద్యార్థి బృందాలు పాల్గొని తమ ప్రతిభాపాటవాలను ప్రదర్శించాయి. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన ఎనిమిది బృందాలు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాయి.

ఈ ఏడాది సదస్సుకు 'సుస్థిరత కోసం విజ్ఞానం, ఆవిష్కరణలు' (ఞఒఅఅఒఎవ ఛఅఽ ×అఅశీజఘ్అశీఅ టశీతీ ఞబఘ్ఘఅఅఘఒఎఅశ్రీఘ్ఎ) ప్రధాన ఇతివృత్తంగా నిర్ణయించారు. ఇందులో భాగంగా వ్యర్థాల నిర్వహణ, ఇంధన వనరుల అన్వేషణ, నీటి సంరక్షణ, ఆహారం, వ్యవసాయం, ఆరోగ్యం, సుస్థిర అభివృద్ధికి భారతీయ సంప్రదాయ విజ్ఞాన అనువర్తనాలు తదితర అంశాలపై విద్యార్థులు వినూత్న పరిశోధనా ప్రాజెక్టులను రూపొందించి ప్రదర్శించారు. తమ పరిసరాల్లోని సామాజిక, పర్యావరణ సమస్యలను గుర్తించి, శాస్త్రీయ పరిశీలన, ప్రయోగాలు, సమాచార సేకరణ, విశ్లేషణ ద్వారా ఆచరణ సాధ్యమైన పరిష్కారాలను అన్వేషించడం ఈ ప్రాజెక్టుల్లో ప్రత్యేకతగా నిలిచింది. విద్యార్థులు తమ ప్రాజెక్టుల రూపకల్పన, పనితీరు, ఉపయోగాలు, సమాజానికి వాటి వల్ల కలిగే ప్రయోజనాలను న్యాయనిర్ణేతలకు వివరించి ఆకట్టుకున్నారు.

రాష్ట్ర స్థాయికి ఎంపికైన బృందాలు:

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, దండుమైలారం - యశ్వంత్ బృందం.
సెయింట్ ఐజాక్ అడ్వెంట్ హై స్కూల్ - సమీర్ బేగం బృందం.
సిల్వర్ డ్రాప్ హై స్కూల్ - ప్రియాంక బృందం.
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బాలాపూర్ - యశస్విని బృందం.
త్రివేణి టాలెంట్ స్కూల్ - సంపత్ బృందం.
శ్రీ గాయత్రి హై స్కూల్ - ఉదయగీతం బృందం.
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మైలార్‌దేవ్‌పల్లి - నిషా ప్రియ బృందం.
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కొత్తగూడ - చరణ్ బృందం.

ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, విద్యార్థులు నిత్యజీవితంలో ఎదురయ్యే సమస్యలను గుర్తించి, వాటికి శాస్త్రీయ పద్ధతుల్లో పరిష్కారాలను అన్వేషించే దిశగా ఆలోచించాలని సూచించారు. ఉపాధ్యాయులు విద్యార్థుల్లో శాస్త్రీయ నైపుణ్యాలను పెంపొందించడంతో పాటు వారిలో పరిశోధనా దృక్పథాన్ని అభివృద్ధి చేసేలా బోధన సాగించాలని పిలుపునిచ్చారు. జిల్లా సైన్స్ అధికారి వై. శ్రీనివాసరావు మాట్లాడుతూ, విద్యార్థులు పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా తమ చుట్టూ ఉన్న సమస్యలను శాస్త్రీయ దృక్పథంతో పరిశీలించి, సృజనాత్మక ఆలోచనలతో నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలని సూచించారు. ఇలాంటి విజ్ఞాన సదస్సులు విద్యార్థుల్లో పరిశోధనా నైపుణ్యాలను, సమస్యల పరిష్కార సామర్థ్యాన్ని పెంపొందించడంతో పాటు భవిష్యత్తులో గొప్ప శాస్త్రవేత్తలుగా ఎదగడానికి దోహదపడతాయని పేర్కొన్నారు.



మండల విద్యాధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ, నేషనల్ చిల్డ్రన్ సైన్స్ కాంగ్రెస్‌తో పాటు సేవ్ ఫస్ట్ ఇన్నోవేషన్, ఈ-వేస్ట్ మేనేజ్‌మెంట్, తెలంగాణ స్కూల్ ఇన్నోవేషన్ ఛాలెంజ్ వంటి సైన్స్ సంబంధిత కార్యక్రమాల్లో జిల్లాలోని సైన్స్ ఉపాధ్యాయులందరూ చురుకుగా పాల్గొని వాటిని విజయవంతం చేయాలని సూచించారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా డాక్టర్ విజయలక్ష్మి, ప్రొఫెసర్ ఉపేందర్ రెడ్డి, ప్రొఫెసర్ లింగమయ్య, డాక్టర్ కిరణ్, ప్రొఫెసర్ డాక్టర్ చెన్నకేశవులు, ఆనంద్ సాయి, డాక్టర్ గోవింద్, సుభాష్ రెడ్డి వ్యవహరించారు.

రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థి బృందాలను అధికారులు, నిర్వాహకులు అభినందించారు. విద్యార్థులకు మార్గదర్శకత్వం వహించిన ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, కార్యక్రమ విజయవంతానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

అక్రమమా.. సక్రమమా..?



- ప్రభుత్వ స్థలంలో ఏకంగా ఇంటి నిర్మాణ పనులు ప్రారంభం.?
- పల్లె దవాఖాన సమీపంలోని ప్రభుత్వ స్థలానికి ఎసరు.?
- అక్రమ నిర్మాణమంటూ ఆరోపణలు. పట్టించుకోని అధికారులు.?
- ఉత్తుత్తి నోటీసులేనా.?జారీ చేసి విచారణలో జాప్యం ఎందుకు.?
- పార్టీ పెద్దలు, అధికారుల అండదండలు ఉన్నాయంటూ అనుమానాలు.?
- కలెక్టర్,డీపీఓ,ఎంపీఓ స్పందించాలని ప్రజల విజ్ఞప్తి

ధారూర్,నవంబర్ 04(జనంసాక్షి):
ధారూర్ మండల పరిధిలోని దోర్నాల్ గ్రామంలో ప్రభుత్వ స్థలాల ఆక్రమణ ఆరోపణలు కలకలం రేపుతున్నాయి.పల్లె దవాఖాన సమీపంలోని ప్రభుత్వ స్థలంలో ఏకంగా ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.నిర్మాణం జరుగుతున్న స్థలం ప్రభుత్వానికి చెందినదని పలువురు ఆరోపిస్తున్నారు.ఈ విషయంపై గతంలోనే సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.ఈ వ్యవహారంపై గ్రామానికి చెందిన యువకుడు మహిపాల్ సోమవారం ప్రజావాణిలో అధికారులకు ఫిర్యాదు చేశారు.ప్రభుత్వ స్థలంలో జరుగుతున్న నిర్మాణాలపై గతంలోనూ సంబంధిత అధికారులు నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది.అయితే నోటీసులు జారీ చేసిన తర్వాత విచారణను ఎందుకు ముందుకు తీసుకెళ్లడం లేదన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకున్నారా.?లేక విచారణలో ఉద్దేశపూర్వకంగానే జాప్యం చేస్తున్నారా.? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ స్థలాలను కొందరు ఆక్రమించుకుంటూ,తప్పుడు రిజిస్ట్రేషన్ పత్రాలతో సొంతం చేసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం నిర్మాణం చేపడుతున్న స్థలానికి అసలు యజమాని ఎవరు.? ఆ స్థలానికి సంబంధించి చట్టబద్ధమైన పత్రాలు ఉన్నాయా.? రిజిస్ట్రేషన్ పత్రాలు అసలైనవా, నకిలీవా.?అనే అంశాలపై సమగ్ర విచారణ జరపాల్సిన అవసరం ఉందని గ్రామస్తులు కోరుతున్నారు.ఈ వ్యవహారంలో కొందరు రాజకీయ నాయకులు,సంబంధిత అధికారుల అండదండలు ఉన్నాయనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి.అయితే ఈ ఆరోపణల్లో వాస్తవాలు అధికారుల విచారణలోనే తేలాల్సి ఉంది.ప్రభుత్వ స్థలాల పరిరక్షణ బాధ్యత ఉన్న అధికారులు నిర్మాణాలు జరుగుతున్నా ఎందుకు స్పందించడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా,గతంలో నోటీసులు జారీ చేసినా విచారణలో పురోగతి లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, డీపీఓ,ఎంపీఓ ప్రత్యేకంగా దృష్టి సారించి స్థలానికి సంబంధించిన రికార్డులను పరిశీలించి,నిర్మాణాలపై సమగ్ర విచారణ చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురైందా లేదా అన్నది తేల్చి, నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టినట్లు నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

రంగన్న ఆత్మీయ సమ్మేళనానికి యాచారం సర్పంచుల గైర్హాజరు

యాచారం, నవంబర్ 4(జనంసాక్షి):
ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్రెడ్డి రంగారెడ్డి బొంగులూరు సమీపంలోని ప్రమిద గార్డెన్‌లో నిర్వహించిన 'రంగన్న ఆత్మీయ సమ్మేళనానికి' యాచారం మండలానికి చెందిన సర్పంచులు గైర్హాజరయ్యారు. ఎమ్మెల్యే శైలిపై ఉన్న అసంతృప్తితోనే సర్పంచులు ఈ సమావేశానికి హాజరుకాలేదని తెలుస్తోంది. సొంత పార్టీకి చెందిన సర్పంచులే ఈ కార్యక్రమానికి దూరంగా ఉండటం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది.
మండలంలోని వివిధ గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల విషయంలో తమకు సరైన న్యాయం జరగడం లేదని సర్పంచులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో టీజీఐఐసీ నిధుల ద్వారా చేపడుతున్న సీసీ రోడ్లు మరియు ఇతర అభివృద్ధి పనులలో తమను నామమాత్రంగా చూస్తూ, ఇబ్బందులకు గురిచేస్తున్నారని పలువురు సర్పంచులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. "ఈ ప్రభుత్వంలో మాకు కనీస గౌరవం దక్కడం లేదు" అని వారు తమ ఆవేదనను వ్యక్తం చేశారు.
ఎమ్మెల్యే వైఖరి ఇలాగే ఉంటే గ్రామాల్లో అభివృద్ధి పనులు మందగిస్తాయని, పార్టీకి కూడా నష్టం జరుగుతుందని పలువురు నాయకులు అభిప్రాయపడ్డారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి అందరినీ కలుపుకొని పోతూ, అందరికీ సమన్యాయం చేయాలని స్థానిక సర్పంచులు మరియు నాయకులు కోరుతున్నారు.

డయాసిస్ రోగులకు అల్పాహారం భోజనం అందించాలి

- శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఆదేశం



మోమిన్ పేట నవంబర్ 4 (జనంసాక్షి):
వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ రోగులకు సమయానికి అల్పాహారం భోజనం అందించి నాణ్యమైన వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ ఆసుపత్రి సూపరిండెంట్ కు ఆదేశించారు బుధవారం మోమిన్ పేట మండలానికి చెందిన డయాలసిస్ రోగులు వికారాబాద్ లో ఆయనను కలిసి వినతి పత్రం అందజేశారు ఈ సందర్భంగా ఆయన ఆసుపత్రి సూపరిండెంట్ తో మాట్లాడి ఆదేశాలు జారీ చేశారు ఇకనుండి డయాలసిస్ రోగులకు ఇతర రోగులతో పాటు అల్పాహారం మధ్యాహ్న భోజనం సాయంత్రం భోజనం అందించి వారికి సహకరిస్తారని ఆయన తెలిపారు స్పందించిన స్పీకర్ను డయాలసిస్ రోగులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు

దీపావళి పండుగ సందర్భంగా క్రాకర్ షాపుల యజమానులకు భద్రతా సూచనలు పాటించాల

- సి ఐ భాస్కర్ రెడ్డి



కాప్రా, నవంబర్ 4 (జనం సాక్షి) : దీపావళి పండుగను పురస్కరించుకొని క్రాకర్ షాపుల యజమానులు తగిన భద్రతా జాగ్రత్తలు పాటించాలని కుషాయిగూడ పోలీస్ ఇన్స్పెక్టర్ ఎల్. భాస్కర్ రెడ్డి గారు సూచించారు.
ప్రతి క్రాకర్ షాపు ముందు నీళ్లు, ఇసుక,మరియు అగ్నిమాపక పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలని, అగ్ని ప్రమాదాలు జరగకుండా తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, సురక్షితమైన వాతావరణంలో ప్రశాంతంగా వ్యాపార కార్యకలాపాలు నిర్వహించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కుషాయిగూడ ఎస్ హెచ్ ఓ ఇన్స్పెక్టర్ ఎల్. భాస్కర్ రెడ్డి గారితో పాటు ఎస్ఐలు సుధాకర్ రెడ్డి, వెంకన్న, సాయిలు, సతీష్ ,విజయ్ మరియు పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

మృతుడు కుటుంబానికి ఆర్థిక సహాయం.....



దోమ, నవంబర్ 04 (జనంసాక్షి): వికారాబాద్ జిల్లా దోమ మండల పరిధిలోని శివ రెడ్డి పల్లి గ్రామానికి చెందిన భీమయ్య అనారోగ్యం కారణంతో మరణించారు. తక్షణ అవసరాల నిమిత్తం కొరకై మృతుడి కుటుంబానికి పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి రామ్మోహన్ రెడ్డి సహకారంతో గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లక్ష్మమ్మ, శ్రీకాంత్ రెడ్డి, మాజీ సర్పంచ్ నరేందర్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ చెన్నయ్య, లక్ష్మీనారాయణ గౌడ్, పిఏసిఎస్ చైర్మన్ యాదవ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శాంత కుమార్, పండరయ్య తదితరులు కుటుంబ సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.



కండక్టర్ ప్రవళిక మృతికి నిరసనగా తాండూరులో ఆర్టీసీ కార్మికుల భారీ ర్యాలీ

తాండూరు నవంబర్ 4(జనంసాక్షి) : గత నెల 26న మణుగూరు డిపోకు చెందిన మహిళా కండక్టర్ ప్రవళికపై దాడి చేసి బస్సులో నుండి తోసివేయడంతో, బస్సు చక్రాల కింద పడి రెండు కాళ్లు విరిగిపోయి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందిన ఘటనకు నిరసనగా తాండూరులో ఆర్టీసీ కార్మికులు నిరసనతో కూడిన ర్యాలీ నిర్వహించారు.తాండూరు డిపో నుండి అంబేద్కర్ విగ్రహం వరకు జరిగిన ఈ ర్యాలీలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని నిరసన వ్యక్తం చేశారు. ప్రవళిక మరణానికి కారకులపై చర్యలు తీసుకోవాలని, ఆమె కుటుంబానికి నష్టపరిహారం ఇవ్వాలని, ఇక ముందు కార్మికులపై ఎలాంటి దాడులు జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకొని కార్మికులకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా డిపో గౌరవ అధ్యక్షులు సోమశేఖర్ మాట్లాడుతూ మణుగూరు డిపో కండక్టర్ ప్రవళిక మరణానికి కారకులైన వారిపై కఠినంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రవళిక కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. వారి కుటుంబానికి కోటి రూపాయల నష్టపరిహారం ఇవ్వాలి, అలాగే ఆమె తల్లికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డిపో గౌరవ అధ్యక్షులు సోమశేఖర్, డిపో కార్యదర్శి నవీన్ గౌడ్, డిపో వర్కింగ్ ప్రెసిడెంట్ బాలప్ప, డిపో అధ్యక్షులు బస్వరాజ్ మరియు పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొన్నారు.

కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వరుని సేవలో ఎమ్మెల్యే బీఎంఆర్



తాండూరు (జనంసాక్షి) : కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వరుని సేవలో ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి దంపతులు దర్శించుకున్నారు.బుధవారం కుటుంబ సమేతంగా శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానంలో శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి. ఎమ్మెల్యే బీఎంఆర్ మాట్లాడుతూ స్వామి వారి కృపతో నా తాండూరు నియోజకవర్గ ప్రజలు,అందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యా లతో ఉండాలని, ప్రతి ఇంటా సంతోషంగా వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా ప్రార్థించానని తెలిపారు. తాండూరు నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి స్వామి వారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆయన కోరుకున్నారు.

పైప్‌లైన్ మరమ్మతులు పూర్తి.. రేపటి నుంచి యథావిధిగా నీటి సరఫరా

పృథ్వీ చౌదరి, టీపీసీసీ జనరల్ సెక్రటరీ



ఎల్బీనగర్ నవంబర్ 4 (జనం సాక్షి) : జడ్జెస్ కాలనీ, సహారా బ్యాక్‌సైడ్, ఆటోనగర్ ప్రాంతాలకు నీటి సరఫరా చేసే ప్రధాన పైప్‌లైన్ నిన్న పగిలిపోవడంతో ఆయా ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించిన టీపీసీసీ జనరల్ సెక్రటరీ పృథ్వీ చౌదరి వెంటనే స్పందించారు. హెచ్‌ఎండబ్ల్యూఎస్ అధికారులతో మాట్లాడి పైప్‌లైన్ మరమ్మతు పనులను తక్షణమే ప్రారంభించేలా చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం మరమ్మతు పనులు పూర్తవుతున్నాయని, రేపటి నుంచి మూడు ప్రాంతాలకు ఎలాంటి అంతరాయం లేకుండా యథావిధిగా నీటి సరఫరా జరుగుతుందని పృథ్వీ చౌదరి తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సమస్యను వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే తమ లక్ష్యమని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని ఆయన స్పష్టం చేశారు.

పట్టభద్రులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి

మున్సిపల్ చైర్పన్ పట్లోళ్ల నీరజ బాల్ రెడ్డి, వైస్ చైర్మన్ అబ్దుల్ రజాక్



తాండూరు నవంబర్ 4(జనంసాక్షి) పట్టభద్రులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని మున్సిపల్ చైర్పన్ పట్లోళ్ల నీరజ బాల్ రెడ్డి పేర్కొన్నారు.ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ఆదేశాల మేరకు, హైదరాబాద్-రంగారెడ్డి మహబూబ్‌నగర్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించేందుకు పట్టణంలోని అక్షర హైస్కూల్, విశ్వవేద ఉన్నత పాఠశాల, గంగోత్రి విద్యాలయ, శ్రీ నేతాజీ గురుదేవ్ గురుకుల్ పాఠశాల, రహ్మానియా హైస్కూల్, ఫ్రంట్‌లైన్ హైస్కూల్, యునైటెడ్ పబ్లిక్ స్కూల్, మార్నింగ్ స్టార్స్ స్కూల్, సెయింట్ మార్క్స్ ఇంటర్నేషనల్ స్కూల్, సెయింట్ మేరీస్ స్కూల్ యాజమాన్యాల సహకారంతో ఆయా విద్యాసంస్థల అధ్యాపకులతో మున్సిపల్ చైర్మన్ పట్లోలు నీరజ బాల్ రెడ్డి , మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్దుల్ రజాక్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ నీరజ బాల్ రెడ్డి , మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్దుల్ రజాక్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి పట్టభద్రుడికి ఓటు హక్కుపై అవగాహన కల్పించి ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములుగా చేయాలని పిలుపునిచ్చారు.గతంలో ఓటు



నమోదు చేసుకున్నవారు కూడా ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం మళ్లీ కొత్తగా నమోదు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. 2023 నవంబరు 1వ తేదీకి ముందు డిగ్రీ పూర్తి చేసిన పట్టభద్రులంతా ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు.ప్రతి పట్టభద్రుడు తన ఓటు హక్కును వినియోగించుకునేలా ఓటు నమోదు చేసుకోవాలని కోరారు.ఇంకా రెండు రోజులే గడువు ఉందని, నవంబరు 6వ తేదీ లోపు నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.కేవలం మనం నమోదు చేసుకుంటే సరిపోదని, కుటుంబాల్లో, బంధువులు, మిత్రుల్లో ఉన్న అర్హులైన పట్టభద్రులందరికీ సమాచారం అందించి వారి ఓట్లు కూడా నమోదు చేయించే బాధ్యత తీసుకోవాలని కోరారు. ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వినియోగించాలని, నీటి వనరులను సంరక్షించుకోవాలని కోరుతూ, నీటి పొదుపు అనేది భవిష్యత్ తరాలకు మనం చేయవలసిన బాధ్యత అని గుర్తు చేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్లతో పాటు కాంగ్రెస్ నాయకులు, పలు పాఠశాలల యాజమాన్య ప్రతినిధులు మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అల్మాస్‌గూడలో మహిళలపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలి



హయత్ నగర్, నవంబర్ 4 (జనంసాక్షి) : బడంగ్‌పేట పరిధి అల్మాస్‌గూడలో బైబిల్ కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఇద్దరు మహిళలపై దాడికి పాల్పడిన వారిని ప్రభుత్వం, పోలీసు అధికారులు వెంటనే గుర్తించి అరెస్టు చేయాలని సీపీఎం ఎల్బీనగర్ సర్కిల్ కమిటీ డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా సీపీఎం ఎల్బీనగర్ సర్కిల్ కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. అల్మాస్‌గూడలో ఇద్దరు మహిళలపై దాడి జరిగినట్లు చూపిస్తున్న వీడియోను చూస్తుంటే తీవ్ర ఆవేదన కలుగుతోందని అన్నారు. మహిళలు బైబిల్ కరపత్రాలు పంపిణీ చేయడం వారి మత స్వేచ్ఛకు సంబంధించిన విషయమని, ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే చట్టబద్ధంగా తెలియజేయాలే తప్ప భౌతిక దాడులకు పాల్పడటం ఎంతమాత్రం సమర్థనీయం కాదని పేర్కొన్నారు. ఈ ఘటనపై తెలంగాణ పోలీసులు తక్షణమే స్పందించి దాడికి పాల్పడిన వ్యక్తులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత మహిళలకు తగిన రక్షణ కల్పించి న్యాయం చేయాలని కోరారు. మహిళలపై దాడులను సీపీఎం ఎల్బీనగర్ సర్కిల్ కమిటీ తీవ్రంగా ఖండిస్తోందని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఆలేటి ఎల్లయ్య అన్నారు. మత స్వేచ్ఛను, మహిళల గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. బాధ్యులను వెంటనే అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోకపోతే మహిళా సంఘాలు, ప్రజాసంఘాలను సమీకరించి రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని, పోలీసు అధికారులను హెచ్చరించారు.

భూ వినియోగ మార్పులకు త్వరగా అనుమతులివ్వాలి

శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి



ఎల్బీనగర్ నవంబర్ 4 (జనం సాక్షి) : ఎల్బీనగర్ నియోజకవర్గంలోని పలు కాలనీల్లో భూ వినియోగ మార్పులకు పెండింగ్‌లో ఉన్న అనుమతులను త్వరితగతిన మంజూరు చేయాలని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి కోరారు. ఈ మేరకు బుధవారం హెచ్‌ఎండిఏ ఎండీ సర్ఫరాజ్ అహ్మద్‌ను ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. బండ్లగూడ, ఫతుల్లాగూడ, కర్మన్‌ఘాట్, కొత్తపేట, లింగోజిగూడ, నాగోల్, హయత్‌నగర్ తదితర ప్రాంతాల్లోని పలు కాలనీలకు సంబంధించి ఓపెన్ స్పేస్, కన్జర్వేషన్, ఇండస్ట్రియల్, మాన్యుఫ్యాక్చరింగ్ జోన్లను నివాస ప్రాంతాలుగా మార్చాలని ప్రతిపాదనలు సమర్పించినట్లు తెలిపారు. గతంలోనే అవసరమైన పత్రాలు అందజేసినా మూడేళ్లుగా ప్రక్రియ పెండింగ్‌లో ఉందని పేర్కొన్నారు. అదేవిధంగా బి.ఎన్. రెడ్డి నగర్ డివిజన్‌లో పార్కులు, వాకింగ్ ట్రాక్‌లు, ఓపెన్ జిమ్‌లు, పిల్లల ఆటస్థలాలు, కమ్యూనిటీ హాళ్ల అభివృద్ధికి పరిపాలనాపరమైన, ఆర్థిక అనుమతులు మంజూరు చేయాలని కోరారు. సమస్యలు పరిష్కరించకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. దీనిపై హెచ్‌ఎండిఏ ఎండీ సర్ఫరాజ్ అహ్మద్ సానుకూలంగా స్పందిస్తూ, సమస్యలను పరిశీలించి త్వరితగతిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బి.ఎన్. రెడ్డి నగర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు కటికరెడ్డి అరవింద్ రెడ్డి, వైదేహి నగర్ నార్త్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పోగుల రాంబాబు, కొత్త భాస్కర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తమ్మలోనిగూడలో ఖేత్ బచావో అభియాన్' అవగాహన



యాచారం, నవంబర్ 4(జనంసాక్షి) యాచారం మండలంలోని తమ్మలోనిగూడ గ్రామ పంచాయతీ కార్యాలయంలో వ్యవసాయ భూముల పరిరక్షణ (ఖేత్ బచావో అభియాన్) కార్యక్రమం కింద మండల వ్యవసాయ అధికారి రవినాథ్ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. రాబోయే రబీ (యాసంగి) సీజన్‌లో ఎన్నినో ప్రభావాలను ఎదుర్కొనేందుకు వీలుగా ముందస్తు పంట ప్రణాళిక, నీటి సంరక్షణ మరియు మెట్ట పంటల సాగుపై అవగాహన కల్పించారు. అలాగే సేంద్రీయ, సమీకృత వ్యవసాయంతో పాటు సుస్థిర జీవనోపాధికి తోడ్పడే పాడి పరిశ్రమ, పశుసంరక్షణ, కోళ్ల పెంపకం, పట్టు పరిశ్రమ వంటి అనుబంధ రంగా ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దెంది రాం రెడ్డి,ఏఈఓ వో నవ్య, పంచాయతీ కార్యదర్శి శ్రీశైలం, స్థానిక రైతులు పాల్గొన్నారు.

నూతనంగా నిర్మించిన డ్వాక్రా భవనం ప్రారంభానికి సిద్ధం

ఇంకుడు గుంతలను పూర్తిచేసిన గ్రామ సర్పంచి అనిత ఆంజనేయులు, ఉప సర్పంచ్ ఎన్మతల బాలరాజ్

నవాబుపేట్ నవంబర్ 4 (జనం సాక్షి) : నవాబుపేట్ మండల పరిధిలోని గేట్ వనంపల్లి గ్రామ సర్పంచి అనిత ఆంజనేయులు ఆధ్వర్యంలో మండల పరిధిలోని ఉన్నటువంటి గ్రామం పంచాయతీ ఆధ్వర్యంలో గేట్ వనంపల్లి సర్పంచ్ అనిత, ఆమె మాట్లాడుతూ ఎన్నికల ఆధ్వర్యంలో ఇచ్చిన హామీలను గ్రామ ప్రజలకు సమస్యలు నెరవేర్చడు నా పని అంటూ అనిత మాట్లాడారు. గ్రామ ఉపసర్పంచ్ బాలరాజ్ మాట్లాడుతూ గేటు వనంపల్లి గ్రామాన్ని అభివృద్ధి చేయడానికి మా వంతు పూర్తిగా బాధ్యతలు తీసుకొని గ్రామాన్ని ఆదర్శవంతంగా చేయడమే మా లక్ష్యం అన్నారు. సర్పంచి అనిత మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన పథకలను గ్రామానికి అందించడమే మా లక్ష్యం అంటూ గ్రామంలోని ఎన్ని సమస్యలు ఉన్నా మాకు సమాచారం ఇచ్చిన వెంటనే ఇచ్చిన సమాచారాన్ని ప్రభుత్వానికి అందించి సమస్యలు తీర్చిదిద్దే విధంగా ప్రయత్నం చేస్తానని అనిత అన్నారు. గత నెల రోజుల నుండి ఇంకొంతలకు ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల మేరకు ప్రజలను ఉద్దేశించి వర్షాకాలం రాకపోవడం వల్ల త్రాగడానికి నీళ్ల లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న గ్రామ ప్రజలందరికీ ఇబ్బందులు పడుతున్న సందర్భంగా ప్రభుత్వం ఇంకుడు గుంతలను ప్రతి గ్రామంలో నిర్వహించినట్లయితే పారబోసే నీటిని వృధా కాకుండా ఇంకో గుంతలో నిలిచి నీరు ఆదాయం అయ్యే ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల మేరకు ఏ గ్రామంలోని పూర్తి చేయని విధంగా గేటు వనంపల్లిలో ఇంకుడు



గుంతలను పూర్తి చేసిన సర్పంచ్ అనితకి దక్కిందని గ్రామస్తులు పేర్కొన్నారు. ప్రభుత్వము అందించే పథకాలను మా గ్రామానికి అందించినట్లయితే మా గ్రామంలోని ఉన్న సమస్యలు ప్రజలందరికీ అనుకూలంగా అవసరమయ్యే పథకాలను అందించేందుకు ప్రభుత్వము శాశ్వతుల కృషి చేయాలని సర్పంచ్ అనిత తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు గేటు వనంపల్లి గ్రామంలో డ్వాక్రా మహిళా సంఘాలకు సమావేశం ఏర్పాటు చేసుకోవడానికి ఎక్కడ ఉండటానికి ఏమీ లేకుండా ఉన్న మహిళకు ప్రభుత్వ ఆదేశాల మేరకు బిల్డింగును 20 లక్షలతో మంజూరు చేశారు మంజూరు చేసిన బిల్డింగును వెంటనే గ్రామ సర్పంచ్ అనిత ఉపసర్పంచి బాలరాజు ఆధ్వర్యంలో బిల్డింగ్ను గత మూడు నెలల్లో పూర్తి చేశామన్నారు. బిల్డింగ్ కు సరిపడా డబ్బులు లేకున్నా గ్రామ సర్పంచ్ ఉప సర్పంచ్ ఆధ్వర్యంలో సొంత డబ్బులతో బిల్డింగును పూర్తిచేసిన ఘనత వారికే దక్కిందని అన్నారు ప్రభుత్వము యొక్క బిల్డింగు డబ్బులు తొందరగా బిల్లు శాంక్షన్ అయితే బాగుంటుందని వారు. నవాబుపేట్ మండల పరిధిలోని ఏ గ్రామంలోని కానీ ఇంకుడు గుంతలను గేటు వనంపల్లి గ్రామంలో సర్పంచ్ ఉప సర్పంచ్ ఆధ్వర్యంలో పూర్తిచేసిన ఘనత వారికే దక్కిందని గ్రామ ప్రజలు. యొక్క గ్రామ సమస్యలతో తోడు నీడగా ఉంటున్నటువంటి ఆంజనేయులు, పంచాయతీ వాడు, పంచాయతీ, మాజీ సర్పంచులు మాజీ ఎంపీటీసీలు డ్వాక్రా యువజన సంఘాల నాయకులు అందరి సహాయ గ్రామాన్ని అభివృద్ధి అయ్యేవిధంగా పూర్తి చేస్తామని గ్రామ సర్పంచి అనిత తెలిపారు.



రూ. 2 కోట్ల ప్రజాధనం వృధా కానివ్వం

నిరుపయోగంగా ఉన్న మిల్లు భవనానికి త్వరలోనే మోక్షం
అసంపూర్తి పనులు వేగవంతం చేసి పీఏసీఎస్ ఆదాయ వనరుగా మారుస్తాం
పాలకవర్గంతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించిన యాలాల పీఏసీఎస్ నూతన చైర్మన్ బి.అనిల్ కుమార్

యాలాల నవంబర్ 4 (జనంసాక్షి) : ప్రభుత్వ నిధులు సుమారు రూ. 2 కోట్ల భారీ వ్యయంతో యాలాల మండలంలోని దౌలాపూర్ ప్రాంతంలో నిర్మించిన మిల్లు భవనం నిరుపయోగంగా పడి ఉండటం దురదృష్టకరమని, అసంపూర్తిగా మిగిలిపోయిన పనులన్నింటినీ త్వరితగతిన పూర్తి చేసి ప్రజాధనానికి సార్థకత చేకూరుస్తామని యాలాల మండల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) నూతన చైర్మన్ భీంశెట్టి అనిల్ కుమార్ స్పష్టం చేశారు. మంగళవారం ఆయన నూతన పాలకవర్గ డైరెక్టర్లు మరియు సంఘం సిబ్బందితో కలిసి మిల్లు భవన సముదాయాన్ని క్షేత్రస్థాయిలో సందర్శించి, అక్కడి భౌతిక పరిస్థితులను, నిర్మాణ నాణ్యతను క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ సందర్భంగా చైర్మన్ భీంశెట్టి అనిల్ కుమార్ మాట్లాడుతూ, రైతాంగానికి అండగా నిలవాల్సిన సహకార సంఘం పరిధిలో ఇంత పెద్ద ఎత్తున నిధులు వెచ్చించి నిర్మించిన భవనంలో, ప్రస్తుతం మిల్లుకు సంబంధించిన ఆధునిక యంత్రాలు లేకపోవడం వల్ల అది కేవలం ఒక ఖాళీ షెడ్డులా మిగిలిపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో పనులు అర్ధాంతరంగా నిలిచిపోవడం వల్ల ఇటు రైతులకు సేవలు అందడం లేదని, అటు సహకార సంఘానికి ఎలాంటి లాభం చేకూరడం లేదన్నారు. విలువైన ప్రభుత్వ ఆస్తులు ఇలా



కాలయాపనకు గురైతే, చివరికి ఆ ఆర్థిక భారాన్ని, నష్టాన్ని మోయాల్సింది బ్యాంకు మరియు సహకార సంఘమేనని ఆయన విశ్లేషించారు. కేవలం నిధులు ఖర్చు చేసి భవనాలను నిర్మించి వదిలేయడం వల్ల ఎవరికి ప్రయోజనం ఉండదని, అందుబాటులో ఉన్న ఈ భారీ షెడ్డు సముదాయాన్ని సంఘానికి ప్రతి నెలా స్థిరమైన ఆదాయం తెచ్చిపెట్టే మార్గంగా ఎలా మార్చవచ్చో ఆలోచించాలన్నారు. మిల్లు ప్రారంభానికి అవసరమైన యంత్రాల ఏర్పాటు లేదా ప్రత్యామ్నాయంగా రైతు సంక్షేమ కార్యక్రమాలకు, గిడ్డంగుల అవసరాలకు ఈ స్థలాన్ని ఎలా లబ్ధి చేకూర్చే విధంగా మలచుకోవచ్చో నివేదిక ఇవ్వాలని అక్కడి సిబ్బందిని ఆదేశించారు. గత పాలకవర్గాల హయాంలో నిర్మించిన ఈ విలువైన ఆస్తిని సంరక్షించుకుంటూ, పీఏసీఎస్ ఆర్థిక ప్రగతికి ఇది దోహదపడేలా నూతన పాలకవర్గ డైరెక్టర్లు, సిబ్బంది అందరూ ఒకే తాటిపైకి వచ్చి సమన్వయంతో తదుపరి చర్యలు వేగవంతం చేయాలని పిలుపునిచ్చారు.రైతుల ప్రయోజనాలే పరమావధిగా నూతన పాలకవర్గం పనిచేస్తుందని, త్వరలోనే ఈ మిల్లు షెడ్డుకు ఒక స్పష్టమైన రూపు తీసుకువచ్చి సంఘానికి నూతనోత్తేజం అందిస్తామని చైర్మన్ ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ పాలకవర్గ డైరెక్టర్లు, సహకార సంఘ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



చిన్నారుల కంటి ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

ఖైరతాబాద్‌లో ఉచిత కంటి పరీక్షలు
ప్రాజెక్ట్ దృష్టి ద్వారా సేవా కార్యక్రమం
హాజరైన మాజీ కార్పొరేటర్ మహేష్ యాదవ్

ఖైరతాబాద్, నవంబర్ 04 (జనంసాక్షి) : చిన్నారుల్లో కంటి సమస్యలను ప్రాథమిక దశలోనే గుర్తించి, మెరుగైన కంటి ఆరోగ్యాన్ని అందించాలనే లక్ష్యంతో ఖైరతాబాద్‌లో ఉచిత కంటి పరీక్షల శిబిరాన్ని నిర్వహించారు.రోటరీ క్లబ్ ఆఫ్ బంజారా హిల్స్, ఎల్.వి.ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం శాకా గ్రౌండ్స్‌లో ప్రాజెక్ట్ దృష్టి కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ నాయకుడు, మాజీ కార్పొరేటర్ మహేష్ యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్నారుల సంపూర్ణ ఆరోగ్య పరిరక్షణలో కంటి చూపు ఎంతో కీలకమని అన్నారు. చిన్న వయసులోనే కంటి సమస్యలను గుర్తించి తగిన చికిత్స అందించడం ద్వారా భవిష్యత్తులో ఎదురయ్యే ఇబ్బందులను నివారించవచ్చని పేర్కొన్నారు. సమాజానికి ఉపయోగపడే ఇటువంటి సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చా రు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ బంజారా హిల్స్ అధ్యక్షుడు రోటేరియన్ జి.వాసుదేవన్, కార్యదర్శి రోటేరియన్ కౌశిక్ కతురి, మెడికల్ సర్వీస్ ప్రాజెక్ట్స్ డైరెక్టర్ రోటేరియన్ ఉమా అయ్యాలా, యూత్ సర్వీసెస్ డైరెక్టర్, అడ్వైజర్ రోటేరియన్ దుర్గ ప్రసాద్ మదాసు, కాంగ్రెస్ నాయకులు ప్రవీణ్, బీఆర్ఎస్ నాయకులు మధుకర్ యాదవ్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

సనత్‌నగర్‌లో విస్తృతంగా గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు పత్రాల సేకరణ

అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకోవాలి: కొలన్ బాల్ రెడ్డి



సనత్‌నగర్, జనంసాక్షి : సనత్‌నగర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కొలన్ బాల్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు పత్రాల సేకరణ కార్యక్రమం విస్తృతంగా కొనసాగుతోంది. అర్హులైన ప్రతి పట్టభద్రుడిని ఓటరుగా నమోదు చేయించాలనే లక్ష్యంతో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో చురుగ్గా పనిచేస్తున్నారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా అర్హులైన పట్టభద్రులు తమ వివరాలను అందించి ఓటరు నమోదు ప్రక్రియకు సహకరించాలని కొలన్ బాల్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. శ్రీ రాజరాజేశ్వరి కాలనీ అధ్యక్షుడు గౌరు సుధాకర్ రెడ్డి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా నమోదు చేసిన 100 మంది గ్రాడ్యుయేట్ల ఓటరు నమోదు పత్రాలను కొలన్ బాల్ రెడ్డికి అందజేశారు. మిగిలిన పత్రాలను కూడా త్వరలో అందజేస్తామని తెలిపారు. 2023 నవంబర్ 1వ తేదీ నాటికి డిగ్రీ పూర్తి చేసి, నిబంధనల ప్రకారం అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ పట్టభద్రుల ఓటరుగా నమోదు చేసుకోవాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీ రాజరాజేశ్వరి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు భీమ్ నారాయణ, సంగప్ప, శ్రీహరి, జయరాజ్, నరసయ్యతో పాటు బీఆర్ఎస్ నాయకులు హరి పిళ్లే, వీరేష్, భార్గవ్, రేణుక తదితరులు పాల్గొన్నారు.



ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించాలి

ఎస్ఐ మారయ్య

మహేశ్వరం, నవంబర్4(జనంసాక్షి):యువత ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించాలని ఎస్ఐ మారయ్య అన్నారు.బుధవారం మహేశ్వరం మోడల్ కాలేజ్ లో నషా ముక్త్ భారత్ డ్రగ్ ఫ్రీ భారత్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎస్ఐ మారయ్య మాట్లాడుతూ...యువత ఆరోగ్యంగా క్రమశిక్షణతో ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని ముందుకు సాగాలన్నారు. మదక ద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయం వంటి కార్యకలాపాలను అరికట్టడంలో పోలీసు, సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులకు సహకరించాలన్నారు.డ్రగ్స్ వద్దు ఆరోగ్యమే ముద్దు అనే నినాదంతో యువతను కాపాడుకోవాలన్నారు. మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ గోపి,మై భారత్ కోఆర్డినేటర్ ముయ్యాడ శివకుమార్, మణికుమార్,మునావత్ దేవేందర్, పలువురు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బొంబాయి అంతర్జాతీయ కరాటే టోర్నమెంట్‌లో చేవెళ్ల విద్యార్థుల పతకాల పంట

గ్రాండ్ ఛాంపియన్‌గా అశోక్



చేవెళ్ల (జనంసాక్షి) బొంబాయిలో నిర్వహించిన అంతర్జాతీయ కరాటే టోర్నమెంట్‌లో చేవెళ్లకు చెందిన విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. వివిధ విభాగాల్లో పోటీపడి ఒక బంగారు, రెండు వెండి, మూడు కాంస్య పతకాలను కైవసం చేసుకున్నారు. సుమారు 10 దేశాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్న ఈ అంతర్జాతీయ పోటీల్లో అండర్-6 నుంచి అండర్-18 వరకు కటా, ఫైట్ విభాగాల్లో చేవెళ్ల విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. కరాటే మాస్టర్ కృష్ణ (సెన్సై) ఆధ్వర్యంలో జపాన్ షోటోకాన్ అసోసియేషన్ తరఫున విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. కరాటే విభాగంలో సిద్ధూ, అశోక్ ప్రథమ స్థానాలు సాధించగా, అశోక్ గ్రాండ్ ఛాంపియన్‌షిప్‌ను సొంతం చేసుకున్నాడు. మణి దీక్షిత్, సాత్విక్, కౌశిక్, రోహన్ ద్వితీయ స్థానాలు సాధించారు. వీరిలో సాత్విక్ అండర్-12 ఫైట్ విభాగంలో, దీక్షిత్, కౌశిక్ అండర్-12 విభాగంలో, రోహన్ అండర్-6 విభాగంలో ప్రతిభ కనబరిచారు. అదేవిధంగా గౌతమ్ కుమార్ అండర్-10 విభాగంలో, మల్లికార్జున (39) సీనియర్ సిటిజన్ విభాగంలో తృతీయ స్థానం సాధించి కాంస్య పతకాలు అందుకున్నారు. ఈ టోర్నమెంట్‌లో శ్రీలంక, బంగ్లాదేశ్, ఆస్ట్రేలియా, నేపాల్, జపాన్, చైనా, ఇంగ్లండ్, రష్యా, ఇండోనేషియా తదితర దేశాల క్రీడాకారులతో పాటు దాదాపు 3 వేల మంది పాల్గొన్నారు. అంతర్జాతీయ స్థాయి పోటీల్లో చేవెళ్ల విద్యార్థులు పతకాలు సాధించడంతో కరాటే మాస్టర్ కృష్ణతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

రేపు చర్లపల్లి పారిశ్రామికవాడలో స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను ప్రారంభించనున్న మంత్రి శ్రీధర్ బాబు



కాప్రా (జనంసాక్షి): చర్లపల్లి పారిశ్రామికవాడలో ఏడు కోట్ల రూపాయల వ్యయంతో అంతర్జాతీయ ప్రమాణాలతో నూతనంగా నిర్మించిన ప్రొఫెసర్ జయశంకర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్, ఈఎస్ఐ ఆసుపత్రిని ఈ నెల 6వ తేదీ శుక్రవారం రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ప్రారంభిస్తున్నట్లు చర్లపల్లి ఐలా చైర్మన్ గోవిందరెడ్డి తెలిపారు. బుధవారం చర్లపల్లి ఐలా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చర్లపల్లి పారిశ్రామిక వాడలోని పారిశ్రామికవేత్తల సహకారంతో సుమారు 7 కోట్ల రూపాయలతో అంతర్జాతీయ ప్రమాణాలు కలిగిన స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మించామని తెలిపారు అలాగే పారిశ్రామిక వాడలోని కార్మికుల శ్రేయస్సు కోసం నూతనంగా నిర్మించిన ఈఎస్ఐ ఆసుపత్రి భవనాన్ని శుక్రవారం మంత్రి చేతుల మీదుగా ప్రారంభించ నున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు తో పాటు మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ గౌరవ అతిథిగా, టీజీఐసీ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె. శశాంక ఐఏఎస్, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, టీజీఐసీ జోనల్ మేనేజర్ బి. మధు, తెలంగాణ ఇండస్ట్రీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు కె. సుధీర్ రెడ్డి ప్రత్యేక అతిథులుగా హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో చర్లపల్లి ఐలా చైర్మన్ డాక్టర్ కె. గోవింద రెడ్డి, ఉపాధ్యక్షుడు తాటి శ్రీనివాస్, కార్యదర్శి జి. రాఘవయ్య, కోశాధికారి ఇ. మల్లికార్జున రెడ్డితో పాటు నిర్వహణ కమిటీ సభ్యులు, పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి

భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి • మల్‌రెడ్డి రంగారెడ్డి ఆత్మీయ సమ్మేళనం

రంగారెడ్డి, నవంబర్ 4 (జనంసాక్షి)



ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల్లో ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి ఆధ్వర్యంలో బొంగులూరు సమీపంలోని ప్రమిద గార్డెన్లో రంగన్న ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సమ్మేళనానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆత్మీయ సమ్మేళనంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ మండల, నియోజకవర్గస్థాయి నేతలు పలుఅంశాలను లేవనెత్తారు. మల్‌రెడ్డి రంగారెడ్డి చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను, సంక్షేమ పథకాలను కొనియాడారు. మల్‌రెడ్డి గెలుపుతోనే ఇబ్రహీంపట్నం నియోజకవర్గ రూపురేఖలు మారిపోయాయని, కోట్లాది రూపాయల నిధులు గ్రామాలకు వస్తున్నట్లు చెప్పారు. నామినేటెడ్ పదవులు, పలు ఇతర అంశాలను రాష్ట్ర నాయకత్వం దృష్టికి తీసుకువెళ్లాలని ఎంపీ, ఎమ్మెల్యేను ఈ సందర్భంగా కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలో చేసిన అప్పులు, అవినీతితో పరిస్థితి అగమ్యగోచరంగా మారిందన్నారు. ఈ పరిస్థితుల్లో పాలనాపగ్గాలు చేపట్టిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇప్పుడిప్పుడే కుదురుకుంటుందని తెలిపారు. అవరోధాలున్నా ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చుతూ, అప్పుల భారం తగ్గించుకునే ప్రయత్నం చేస్తున్నట్లు చెప్పారు. ఈ క్రమంలోనే కార్యకర్తల్లో కొంతవరకు నైరాశ్యం ఉన్నట్లు పార్టీ గుర్తించినట్లు చెప్పారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో పదవుల అంశంపై ఎమ్మెల్యే మల్‌రెడ్డితో కలిసి, సీఎంతో చర్చిస్తానని ఎంపీ హామీ ఇచ్చారు. ఎల్‌నినో ప్రభావం ఇంకా మొదలుకాలేదని, ఇప్పటి నుంచే ప్రజలను అప్రమత్తం చేయాలని కార్యకర్తలకు సూచించారు. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ.. ఇబ్రహీంపట్నం నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రాధాన్యత మేరకు ఒక్కో కార్యక్రమం చేపడుతూ వస్తున్నామన్నారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరంలేదన్నారు. ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలను క్షేత్రస్థాయిలో ఎక్కడికక్కడ ఎండగట్టాలని పిలుపునిచ్చారు. ప్రతీ కార్యకర్త సోషల్ మీడియాలో యాక్టీవ్‌గా ఉండాలని చెప్పారు. పార్టీ గెలుపు కోసం ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రోడ్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి , కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు అభిషేక్‌రెడ్డితో పాటు నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులు వేలాదిగా తరలివచ్చారు.



ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్ట పోలీసు బందోబస్తు

బందోబస్తు, ట్రాఫిక్ నిర్వహణపై అధికారులకు ఎస్పీ స్నేహ మెహ్రా దిశానిర్దేశం

కొడంగల్, నవంబర్ 4 (జనం సాక్షి): కొడంగల్ నియోజకవర్గంలో ఈ నెల 7, 8, 9 తేదీల్లో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పర్యటన, బహిరంగ సభ, రైతు మేళా, వివిధ అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల నేపథ్యంలో పటిష్టమైన పోలీసు భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఐపీఎస్ పోలీసు అధికారులను ఆదేశించారు. బుధవారం కొడంగల్‌లోని కాడా కార్యాలయంలో జిల్లా పోలీసు అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, రూట్ మ్యాపింగ్, విధుల కేటాయింపు, పోలీసు సిబ్బంది మోహరింపు తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమగ్రంగా వివరించారు.ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాలు, బహిరంగ సభా ప్రాంగణం, రైతు మేళా నిర్వహించే స్థలం, పార్కింగ్ ప్రాంతాలు, ట్రాఫిక్ పాయింట్లను మ్యాపింగ్ ద్వారా చూపిస్తూ ప్రతి పోలీసు అధికారి తమకు కేటాయించిన విధులు, బాధ్యతలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు.అనంతరం ఎస్పీ క్షేత్రస్థాయిలో



పర్యటించి బహిరంగ సభా ప్రాంగణం, రైతు మేళా నిర్వహించే ప్రాంతం, ట్రాఫిక్ నియంత్రణ పాయింట్లు, పార్కింగ్ స్థలాలను పరిశీలించారు. బందోబస్తులో పాల్గొనే సిబ్బంది అప్రమత్తంగా, క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని, అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేసి ముఖ్యమంత్రి పర్యటనను ప్రశాంతంగా, విజయవంతంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ రాజేష్ మీనా, డీసీఆర్బీ డీఎస్పీ జనయ్య, డీటీసీ డీఎస్పీ శ్రీనివాస్, పరిగి డీఎస్పీ ఎన్. శ్రీనివాస్, తాండూరు డీఎస్పీ నర్సింగ్ యాదయ్య, ఏఆర్ డీఎస్పీ వీరేష్, జిల్లా పోలీసు సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

ఈర్లపల్లిలో సత్యం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నీటి శుద్ధి కేంద్రం ఏర్పాటు

రూ.2 లక్షలతో నిర్మాణం.. ప్రారంభించిన ఎమ్మెల్యే కాలే యాదయ్య

చేవెళ్ల, నవంబర్ 04 (జనంసాక్షి) గ్రామీణ ప్రాంత ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలనే లక్ష్యంతో సత్యం ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఫౌండేషన్ ఛైర్మన్ చింపుల సత్యనారాయణరెడ్డి తెలిపారు. చేవెళ్ల మండలం ఈర్లపల్లి గ్రామంలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.2 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన నీటి శుద్ధి కేంద్రాన్ని బుధవారం చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, గ్రామ సర్పంచ్ లావణ్య రాజశేఖర్‌తో కలిసి ప్రారంభించారు. ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ.. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనతోపాటు ప్రజారోగ్యానికి కూడా ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. సేవాభావంతో ముందుకొచ్చి గ్రామస్థులకు స్వచ్ఛమైన తాగునీటి సదుపాయం కల్పించిన సత్యం ఫౌండేషన్ నిర్వాహకులను అభినందించారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఎంతో మేలు చేస్తాయని పేర్కొన్నారు. అనంతరం ఫౌండేషన్ ఛైర్మన్ చింపుల సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్య పరిరక్షణలో స్వచ్ఛమైన తాగునీరు కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. కలుషిత నీటిని తాగడం వల్ల అనేక అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. గ్రామస్థులకు శుద్ధి చేసిన తాగునీరు అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో ఫౌండేషన్ తరఫున ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు. గ్రామ ప్రజలు ఈ



సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చేవెళ్ల మున్సిపల్ చైర్‌పర్సన్ సమతా వెంకట్ రెడ్డి, వైస్ చైర్మన్ రాములు గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ల దేవర వెంకట్ రెడ్డి, గోనే ప్రతాప్ రెడ్డి, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, సర్పంచులు నిర్మల నర్సింలు, రాంచంద్రయ్య గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గిరిధర్ రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, కౌన్సిలర్లు బండారి శైలజ, ఆగిరెడ్డి, దావల్గారి గోపాల్ రెడ్డి, మద్దెల శ్రీనివాస్, ఎంపీడీవో బన్సీలాల్, ఎంపీవో విఠలేశ్వర్, పీఆర్ డీఈఈ గణేష్, మాజీ సర్పంచులు పడాల ప్రభాకర్, రాజశేఖర్, రాంరెడ్డి, వీరేందర్ రెడ్డి, కుంచం శివ కుమార్, కో ఆప్షన్ సభ్యులు, గ్రామ ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.